

RNI NO:TELTEL/ 2023/89546

సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


# విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 136 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 22 సెప్టెంబర్ 2025 | వెల : 4/-



# నేటి నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం

## జీఎస్టీ సంస్కరణలు 'నాగరిక దేవో భవ'ను ప్రతిబింబిస్తాయి

## జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు

## జీఎస్టీ సంస్కరణలతో దేశాభివృద్ధి వేగవంతం

- ఈ మార్పులు రాష్ట్రాల అభివృద్ధికి దోహదం చేస్తాయి
- “పేదలు, మధ్యతరగతి ప్రజలు ఉపయోగించే అనేక వస్తువులపై సున్నా జీఎస్టీ
- పేద, మధ్య తరగతి ప్రజలకు ఇది వారికి డబుల్ బొనాంజా.
- ఇప్పటికే రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చాం
- జీఎస్టీ సవరణలతో ఇప్పటివరకు 12శాతం పరిధిలో ఉన్న 99శాతం వస్తువులు 5శాతం పరిధిలోకి

## సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు



- తిప్పికొట్టిన భారత్
- ఆపరేషన్ సింధూర్ తర్వాత నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపులకు పాల్పడటం ఇదే తొలిసారి.



## టిఎస్ స్టిక్కర్ల స్థానంలో టిజీ స్టిక్కర్లు

- తెలంగాణ స్టేట్ పోలీస్ స్టిక్కర్లను తొలగించి, కొత్తగా 'తెలంగాణ పోలీస్' స్టిక్కర్లను అమర్చాలి
- అన్ని పెట్రోల్ వాహనాలు మరియు పోలీస్ స్టేషన్ వాహనాలను కొత్త రూపంలోకి తీసుకురావాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశం
- హైదరాబాద్ సిటీ పోలీసుల వద్ద ఉన్న అన్ని వాహనాలకు సుమారు రూ.1.6 కోట్ల వ్యయంతో ఈ ప్రక్రియ పూర్తి

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రానికి గల గుర్తింపు గతంలో టిఎస్‌గా ఉండేది. ప్రభుత్వం దానిని కొత్తగా టిజీ గా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనకనుగుణంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన అన్ని వాహనాలపై ఉన్న తెలంగాణ - మిగతా3లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కష్టాలు?



- సుప్రీం కోర్టు విధించిన గడువు సమీపిస్తోంది
- స్పీకర్ గడ్డం పసాద్‌కుమార్ వేగంగా ప్రక్రియ చేపడుతున్నారు.
- స్పీకర్ జారీ చేసిన అదనపు నోటీసులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చలకు దారితీశాయి
- ఒకటి, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న ఫొటోలు, విజ్ఞప్తులు వంటి ఆధారాలు. ఇవి బీఆర్ఎస్‌లోనే ఉన్నాము అనే వాదనను బలహీనపరుస్తున్నాయి
- రెండు, స్పీకర్ ఈ విషయాన్ని సీల్డ్ కవర్‌లో పంపడం వల్ల విచారణ గోప్యతను కాపాడుతూ, రాజకీయ ఒత్తిడిని తగ్గిస్తోంది.

హైదరాబాద్

తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సుప్రీం కోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. దీంతో స్పీకర్ గడ్డం పసాద్‌కుమార్ వేగంగా ప్రక్రియ చేపడుతున్నారు. తాజా చర్యలు అనూహ్యమైన మలుపును తీసుకొచ్చాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలపై డిఫెక్షన్ చట్టం ప్రకారం - మిగతా3లో



## మన టాలెంట్ చూసి భయపడుతున్నట్లున్నారు

- 'మన దేశంలోని యువత ప్రతిభకు అమెరికా భయపడినట్లుంది'
- టాలెంట్ పరంగా చూస్తే మనవాళ్లు మేటి
- దాన్ని చూసే అమెరికా హెచ్ 1 బీ వీసా దరఖాస్తు రుసుమును అమాంతం పెంచేసిందంటూ నవ్వుతూ సెటైర్లు
- పలు దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ఎదురుచూస్తున్నాయి
- భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచకోవడానికి చాలా దేశాలు ముందు వరుసలో ఉన్నాయి
- కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్




## ఎల్టీటీఈ పునరుద్ధరణకు యత్నం

- శ్రీలంక మహిళపై ఈడీ దర్యాప్తు
- భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు
- నిషేధిత ఎల్టీటీఈ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది.

## సింగరేణి ఉద్యోగులకు దసరా అడ్వాన్స్

- వారి ఖాతాల్లో రూ.25వేలు, రూ.12,500!
- రెగ్యులర్ ఉద్యోగులతో పాటు తాత్కాలిక ఉద్యోగులకు కూడా పండుగ అడ్వాన్స్
- రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగులకు అడ్వాన్స్ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అర్హులైన రెగ్యులర్ ఉద్యోగులకు 25వేల రూపాయలు చొప్పున దసరా అడ్వాన్స్

హైదరాబాద్

తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలు చాలా ఘనంగా వైభవోపేతంగా జరుపుకుంటారు. ఈ రెండు పండుగలకు తెలంగాణ ప్రజలు చాలా ప్రాధాన్యతను ఇస్తారు. ఇక ప్రభుత్వాలు కూడా ఈ పండుగలకు ప్రజలకు సంతోషం కలిగేలా అనేక వరాలను ప్రకటిస్తూ ఉంటాయి .మరీ ముఖ్యంగా సింగరేణి అయితే తమ ఉద్యోగులకు దసరా పండుగకు శుభవార్త చెప్పి తీరుతుంది. ఈ ఏడాది దసరా పండుగకు కూడా సింగరేణి యాజమాన్యం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. సింగరేణి ఉద్యోగులకు శుభవార్త సింగరేణి ఉద్యోగులు - మిగతా3లో



## కొచ్చి వాటర్ మెట్రో సరికొత్త రికార్డు



- 50 లక్షల ప్రయాణికులకు చేరిక
- వాటర్ మెట్రో ప్రారంభించిన 29 నెలల్లోనే 50 లక్షల ప్రయాణికులను గమ్య స్థానాలకు తీసుకెళ్లింది
- ఈ 50 లక్షల మెలురాయి ప్రయాణికునిగా ఆస్ట్రేలియాకు చెందిన నైనా నిలిచారు



# నేటి నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం

**న్యూఢిల్లీ:** "నాగరిక్ దేవోభవ..నినాదంతో ముందుకెళ్తున్నాం. రోజువారీ జీవితంలో మనం అనేక విదేశీ వస్తువులు వాడుతున్నాం. వీటి వాడకం తగ్గించాలి. భారత్‌లో తయారైన వస్తువులే మనం వాడాలి. దేశ ప్రజలంతా స్వదేశీ మంత్రం పాటించాల్సిన అవసరం ఉంది. ప్రతి పౌరుడు స్వదేశీ ప్రతిజ్ఞ తీసుకోవాలి" అని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీలో మార్పులు అమల్లోకి రానున్న నేపథ్యంలో జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన.. దేవీ నవరాత్రుల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం కాబోతోందని, కొత్త చరిత్ర మొదలవుతోందని పేర్కొన్నారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తున్నాయని, ఇవి అన్ని రంగాలకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

నేటి నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులు అమల్లోకి రానున్న విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయం మిగులుతుందన్నారు ప్రధాని మోదీ. జీఎస్టీ 2.0పై ఆదివారం ప్రధాని మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఆదాయం మిగులుతుంది. జీఎస్టీ సంస్కరణలతో దేశంలో అందరికి మేలు జరుగుతోంది. జీఎస్టీ సంస్కరణలో భారత వృద్ధి రేటు మరింత పెరుగుతోంది. 2017లో జీఎస్టీ అధ్యాయం మొదలైంది. అంతకుముందు ఎన్నోరకాల పన్నులు ఉండేవి. దేశంలోని అన్ని వర్గాలతోనూ చర్చించి ఈ సంస్కరణలు తెచ్చాం. రేపటి నుంచి కేవలం రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయి. తాజా మార్పులతో వస్తు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పెట్టుబడుల ప్రవాహం



పెరుగుతుంది. ప్రజల పొదుపు పెరుగుతుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**డబుల్ బొనాంజా..**

"పేదలు, మధ్యతరగతి ప్రజలు ఉపయోగించే అనేక వస్తువులపై సున్నా జీఎస్టీ ఉంటుంది. ఇది వారికి డబుల్ బొనాంజా. ఇప్పటికే రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చాం. జీఎస్టీ సవరణలతో ఇప్పటివరకు 12శాతం పరిధిలో ఉన్న 99శాతం వస్తువులు 5శాతం పరిధిలోకి వచ్చాయి. రేపటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఆరోగ్య బీమా, ఔషధాల ధరలు తగ్గుతాయి. హోటల్స్ సేవలపై పన్నులు తగ్గించాం. జీఎస్టీతో వన్ నేషన్-వన్ ట్యాక్స్ స్వప్నం సాకారమైంది" అని ప్రధాని తన ప్రసంగంలో వివరించారు.

అంతకుముందు ఎన్నోరకాల పన్నులు ఉండేవి. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లాలన్నా పన్నులు కట్టాల్సి వచ్చేది. గతంలో బెంగళూరులో వస్తువులు హైదరాబాద్‌కు వచ్చి అమ్ముకోవాలంటే ఎంతో కష్టంగా ఉండేది. గతంలో టోల్,ట్యాక్స్‌లతో కంపెనీలు ఇబ్బంది పడేవి. ఆ ప్రభావం వినియోగదారులపై పడేది. 2024లో గెలిచిన తర్వాత జీఎస్టీలపై ప్రాధాన్యం ఇచ్చాం. జీఎస్టీ సంస్కరణలతో అన్నీ వర్గాలతో మాట్లాడాం. వన్ నేషన్ - వన్ ట్యాక్స్ కలలను సాకారం చేశాం. జీఎస్టీ సంస్కరణలతో దేశం మరింత బలపడుతుంది. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇచ్చాం. ఈ చర్యలతో మధ్య తరగతి జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. అన్నీ రంగాల్లో సంస్కరణలు వస్తుంటాయి. కొత్త జీఎస్టీతో వస్తువుల ధరలు మరింత తగ్గుతాయి. కొన్నింటిపై పూర్తి మినహాయింపు ఉంటుంది. కొత్తజీఎస్టీతో పేద మధ్య తరగతి ప్రజలకు డబుల్ బోనంజా. నాగరిక దేవోభవన అనే నినాదంలో ముందుకు వెళ్తున్నాం. ఆత్మ నిర్భర్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నాం. టీవీ,ఫ్రిజ్,ఇంటి నిర్మాణంపై ఖర్చు తగ్గుతుంది'అని తెలిపారు. మరోవైపు జీఎస్టీ సంస్కరణల వల్ల సంక్లిష్టమైన పన్నుల నుంచి వినియోగదారులు విముక్తి పొందారని ప్రధాని మోదీ తెలిపారు. ప్రతిరోజూ అవసరమైన వస్తువులు పన్ను రహితంగా లేదా 5 శాతం లేదా 18 శాతం జీఎస్టీ కింద ఉంటాయని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు డబుల్ బొనాంజాగా అభివర్ణించారు. ఎంఎస్ఎంఈలతోపాటు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని చెప్పారు. 'స్వదేశీ శ్రేయస్సును పెంచుతుంది. భారత్‌లో తయారు చేసిన ఉత్పత్తులను మనం కొనుగోలు చేయాలి. ప్రతి ఇల్లు, షాపు స్వదేశీని సూచించాలి. ఇది జరిగినప్పుడు భారతదేశం అభివృద్ధి చెందుతుంది' అని మోదీ అన్నారు.

# మన టాలెంట్ చూసి భయపడుతున్నట్లున్నారు

**న్యూఢిల్లీ:** అమెరికా హెచ్1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు రుసుము భారీ పెంచిన నేపథ్యంలో ఒకవైపు ఆందోళన నెలకొంది. యూఎస్ వెళ్లాలనుకునే భారతీయుల ఆశలకు దాదాపు గండిపడింది. సుమారు లక్ష అమెరికన్ డాలర్ల(రూ. 83 లక్షలు) రుసుము చెల్లిస్తే కానీ కొత్తగా హెచ్ 1 బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారిక అవకాశం ఉండదు. అంటే తమ దేశానికి రావొద్దని పరోక్షంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చేశారు. తమ దేశ సంపదను భారతీయులు కొల్లగొట్టేస్తున్నారనే భయం ట్రంప్‌లో మొదలైనట్లుంది. భారతీయుల్లో టాలెంట్‌కు కొదవ లేకపోవడంతో అమెరికాలోని అవకాశాలను ఇట్టే అందిపుచ్చుకుంటున్నారు. ఈ తరుణంలో హెచ్ 1 బీ వీసా దరఖాస్తు రుసుము పెంపుతో దీనిని అడ్డుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ట్రంప్ తన అసూయను బయటపెట్టేసుకున్నారు. ఎప్పుడూ లేని విధంగా హెచ్ 1 బీ వీసా దరఖాస్తు రుసుమును పెంచేశారు. దీనిపై కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ' మన దేశంలోని యువత ప్రతిభకు అమెరికా భయ పడినట్లుంది' అంటూ చమత్కరించారు. ఇదే విషయంపై ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గోయల్ మాట్లాడారు. రేపు(సోమవారం, సెప్టెంబర్ 22వ తేదీ) వాణిజ్య చర్చల్లో భాగంగా అమెరికా పర్యటనకు బయల్దేరి




వెళ్లనున్నారు గోయల్. అయితే ముందుగానే అమెరికా విధించిన హెచ్ 1 బీ వీసా రుసుముకు సంబంధించి ఎదురైన ప్రశ్నకు గోయల్ స్పందించారు. దీనికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. టాలెంట్ పరంగా చూస్తే మనవాళ్లు మేటి అని, దాన్ని చూసే అమెరికా హెచ్ 1 బీ వీసా దరఖాస్తు రుసుమును అమాంతం పెంచేసిందంటూ నవ్వుతూ సెటైర్లు వేశారు. 'మన ప్రతిభను చూసి వాళ్ళు కూడా కొంచెం భయపడుతున్నారు. దానికి కూడా మాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అని చమత్కరించారు. పలు దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ఎదురుచూస్తున్నాయని, భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచకోవడానికి చాలా దేశాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. కాగా, నేటి(ఆదివారం, సెప్టెంబర్ 21వ తేదీ) నుంచి హెచ్1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తి లక్ష డాలర్లు (సుమారు రూ.83 లక్షలు) ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే, ఈ పెంపు కొత్తగా దరఖాస్తు చేసే విదేశీ ఉద్యోగులకు మాత్రమే వర్తించనుంది. ఇప్పటికే హెచ్1-బీ వీసా ఉన్నవారికి తాజా పెంపు వర్తించదని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు తాజాగా విడుదల చేసిన 'ప్రోక్లమేషన్ ఆఫ్ రెస్ట్రిక్షన్ ఆన్ ఎంట్రీ ఆఫ్ సర్టెన్ నాన్‌ఇమ్మిగ్రెంట్ వర్కర్స్' ప్రకటన ప్రకారం హెచ్ 1బీ వీసాలపై కీలకమైన పరిమితులు విధించింది. ట్రంప్ ఆదేశాలను అమలు చేసే యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదిలా ఉంచితే, పీయూష్ గోయల్ భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 22న అమెరికాకు పయనం కానున్నారు. సెప్టెంబర్ 16న ఢిల్లీలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ బృందం.. భారత ప్రతినిధి రాజేష్ అగర్వాల్ తో జరిపిన ఏడు గంటల సుదీర్ఘ సమావేశం తర్వాత ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా విధించిన సుంకాలను తగ్గించడం ఈ చర్చల్లో ఒక కీలక అంశం కానుంది.

# కొత్త వారికే వీసా వార్షిక రుసుము

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1 బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఆ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో వైట్‌హౌస్ కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి హెచ్1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తి లక్ష డాలర్లు (సుమారు రూ.83 లక్షలు) ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే, ఈ పెంపు కొత్తగా దరఖాస్తు చేసే విదేశీ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఇప్పటికే హెచ్1-బీ వీసా ఉన్నవారికి తాజా పెంపు వర్తించదని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు తాజాగా విడుదల చేసిన 'ప్రోక్లమేషన్ ఆఫ్ రెస్ట్రిక్షన్ ఆన్ ఎంట్రీ ఆఫ్ సర్టెన్ నాన్‌ఇమ్మిగ్రెంట్ వర్కర్స్' ప్రకటన ప్రకారం హెచ్ 1బీ వీసాలపై కీలకమైన పరిమితులు విధించింది. ట్రంప్ ఆదేశాలను అమలు చేసే యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ మార్గ దర్శకాల ప్రకారం.. హెచ్ 1 బీ వీసా పొందిన ఈ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది.

**మినహాయింపులు:**

అమెరికా పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలు

అమెరికాలో స్థిర నివాసం ఉన్న వ్యక్తులు




వ్యవసాయం, మాంసం ప్రాసెసింగ్, ప్యాకింగ్ హౌసులు, రవాణా వంటి రంగాల్లో పనిచేసే కార్మికులకు మినహాయింపు ఆరోగ్య సంరక్షణ రంగంలోకి వచ్చే ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు మినహాయింపు ఉంటుంది.

ఈ నిబంధనలు అమెరికాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న కొత్త వీసా దారులకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే దాఖలైన కానీ ఇంకా వీసా పొందని ధరఖాస్తు దారులకు మాత్రమే వర్తిస్తుంది.

**ఏమిటీ హెచ్-1బీ వీసా?**

విదేశీ నిపుణులను అమెరికాలోని కంపెనీలు ఉద్యోగాల్లో నియమించుకోవడానికి వీలుగా 1990వ దశకంలో అమెరికా ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ చట్టం ద్వారా హెచ్%-%1బీ వీసాలను ప్రవేశపెట్టింది. ఈ వీసాలతో లక్షలాది మంది విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు సంపాదించారు. ఇక్కడే స్థిరపడ్డారు. క్రమంగా పౌరసత్వం కూడా పొందారు. హెచ్%-%1బీ వీసా దరఖాస్తు ఫీజు ప్రస్తుతం 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల (రూ.1.76 లక్షలు%-% రూ.4.40 లక్షలు) దాకా ఉంది. తొలుత మూడేళ్ల కాలానికి హెచ్%-%1బీ వీసా జారీ చేస్తారు. అవసరాన్ని బట్టి మరో మూడేళ్లు పొడిగిస్తారు. ఈ వీసాలతో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారత నిపుణులే. ఆ తర్వాత చైనా నిపుణులు ఉంటున్నారు. భారత్‌లో ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన విద్యార్థుల కల హెచ్-1బీ వీసా అంటే అతిశయోక్తి కాదు. దీని గురించి తెలియనివాళ్లు దాదాపు ఉండరు. సాధారణంగా హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజుతోపాటు ఇతర రుసుములను కంపెనీలే భరిస్తాయి. ఇకపై దీనికోసం ఏటా ఒక్కో విదేశీ ఉద్యోగిపై రూ.88 లక్షలకుపైగా చెల్లించాల్సి రావడం అమెరికా సంస్థలకు పెనుభారమే. అది పరోక్షంగా విదేశీ ఉద్యోగులకు.. ముఖ్యంగా భారతీయులకు నష్టం చేకూర్చనుంది. కంపెనీల అవసరాలు తీర్చేలా అత్యధిక ప్రతిభాపాటవాలు ఉంటే తప్ప హెచ్%-%1బీ వీసాతో అమెరికాలో ఉద్యోగం పొందడం దుర్లభమేనని అంటున్నారు.

# ఏక్‌నాథ్ షిండే 'ఎక్స్' ఎకౌంట్ హ్యాక్..
# పాక్, టర్కీ జెండాలు పోస్ట్ చేసిన హ్యాకర్లు

**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు చెందిన సోషల్ మీడియా 'ఎక్స్' ఎకౌంట్ ఆదివారం హ్యాక్ అయ్యింది. హ్యాకర్లు అందులో పాకిస్థాన్, టర్కీ జండాల ఫొటోలను పోస్ట్ చేశారు. దీనిని గుర్తించిన ఏక్‌నాథ్ షిండే సోషల్ మీడియా పర్యవేక్షణ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆసియా కప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య రెండో మ్యాచ్ ఆదివారం జరుగనున్నది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఎక్స్ ఖాతా హ్యాక్ అయ్యింది. ఇస్లామిక్ దేశాలైన పాకిస్థాన్, టర్కీ జండాల ఫొటోలను హ్యాకర్లు అందులో పోస్ట్ చేశారు. కాగా, ఏక్‌నాథ్ షిండే 'ఎక్స్' ఎకౌంట్‌ను పర్యవేక్షించే అధికారి దీనిని గమనించారు. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించారు. ఈ నేపథ్యంలో సుమారు 45 నిమిషాల తర్వాత హ్యాక్ అయిన ఏక్‌నాథ్ షిండే 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించినట్లు ఆ అధికారి వెల్లడించారు.




## సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు..



సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపులకు పాల్పడటం ఇదే తొలిసారి. శనివారం సాయంత్రం జమ్ముకశ్మీర్ లోని కుప్వారా జిల్లాలో నౌగామ్ సెక్టార్ దగ్గర భారత్ - పాకిస్థాన్ బలగాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. శనివారం సాయంత్రం ఎల్‌వోసీ వెంబడి పాకిస్థాన్ బలగాలు భారత స్థావరాలపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాయని అధికారులు తెలిపారు. ఆ కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. దాదాపు ఒక గంటపాటు కొనసాగిన కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని చెప్పాయి. అయితే ఆ ఘటనకు సంబంధించి భారత సైన్యం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

## ఎల్టీటీఈ పునరుద్ధరణకు యత్నం




**చెన్నై:** నిషేధిత తమిళ ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ) పునరుద్ధరణకు శ్రీలంక మహిళ ప్రయత్నించింది. నకిలీ పాస్‌పోర్ట్ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఆమెను ప్రశ్నించనున్నది. శ్రీలంక జాతీయురాలైన లెచ్చుమనన్ మేరీ ఫ్రాన్సిస్కా 2019 డిసెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చింది. అయితే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా చెన్నైలో ఉండటంతో పాటు నకిలీ పత్రాల ద్వారా భారత్ పాస్‌పోర్ట్ పొందింది. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్‌లో చెన్నై విమానాశ్రయంలో మేరీ ఫ్రాన్సిస్కాను తమిళనాడు సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు చేశారు. కాగా, నిషేధిత ఎల్టీటీఈ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది. యాక్టివ్‌గా లేని బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడం, ఎల్టీటీఈ క్యాడర్ల పునఃసమూహానికి సహాయపడేందుకు నిధులు మళ్లించేందుకు ఆమె ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఆమె వాంగ్మూలాల ఆధారంగా టీ కెన్నిస్టన్ ఫెర్నాండో, కే బాస్కరన్ సహా మరో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

మరోవైపు ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారు. డెన్మార్క్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళుడు, మాజీ ఎల్టీటీఈ కార్యకర్త ఉమాకాంతన్‌తో శ్రీలంక మహిళకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఉమాకాంతన్ సూచనల మేరకు పనిచేస్తున్న ఫ్రాన్సిస్కా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోని నిష్క్రియాత్మక ఖాతా నుంచి రూ.42 కోట్లకు పైగా మళ్లించేందుకు ప్రయత్నించినట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఈ కుట్రలో భాగంగా సహచరులకు విదేశీ చెల్లింపులు ఆమె జరిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. కాగా, 2021 అక్టోబర్‌లో అరెస్ట్ అయినప్పటి నుంచి పుళల్ సెంట్రల్ జైలులో మేరీ ఫ్రాన్సిస్కా ఉన్నది. ఎల్టీటీఈ పునరుద్ధరణ కోసం మనీలాండరింగ్‌కు ఆమె పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. దీంతో జైలు ఆవరణలో రెండు రోజుల పాటు ఆమెను ప్రశ్నించేందుకు కోర్టు అనుమతిని ఈడీ కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు 'విచిత్రమైన కేసు'గా అభివర్ణించింది. ఫ్రాన్సిస్కా విచారణ కోసం ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇతర అవసరమైన పరికరాలను ఈడీ అధికారులు జైలులోకి తీసుకెళ్లడానికి కోర్టు అనుమతించింది.

## కొచ్చి వాటర్ మెట్రో సరికొత్త రికార్డు..



**కొచ్చి :** కేరళలోని కొచ్చి వాటర్ మెట్రో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. వాటర్ మెట్రో ప్రారంభించిన 29 నెలల్లోనే 50 లక్షల ప్రయాణికులను గమ్య స్థానాలకు తీసుకెళ్లిందని సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. ఈ 50 లక్షల మెలురాయి ప్రయాణికునిగా ఆస్ట్రేలియాకు చెందిన నైనా నిలిచారు. శనివారం మధ్యాహ్నం ఫోర్ట్ కొచ్చికి ప్రయాణించేందుకు హైకోర్టు టెర్మినల్‌లో నైనా టిక్కెట్ కొనుగోలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కొచ్చి మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ లోక్‌నాథ్ బెహెరా నైనాకు ఒక బహుమతినిచ్చారు. పరిమిత సంఖ్యలో, రూట్లలో నడుస్తున్నప్పటికీ, వాటర్ మెట్రో సౌకర్యవంతమైన , అధిక నాణ్యత ప్రయాణ అనుభవాన్ని అందించడం కారణంగా ఈ విజయం సాధ్యమైందని బెహెరా పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం ఏప్రిల్ 2023, ఏప్రిల్ 25న ప్రారంభించిన కొచ్చి వాటర్ మెట్రో స్థానికులతో పాటు పర్యాటకులలో ప్రజాదరణ పొందింది. అధికారిక ప్రకటన ప్రకారం ఈ ప్రాజెక్ట్‌తో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రపంచ బ్యాంకు తన సంసిద్ధతను వ్యక్తం చేసిందని వార్తా సంస్థ పీటీఐ తెలిపింది. కొచ్చి వాటర్ మెట్రో తన పనితీరు కారణంగా పలు అవార్డులను కూడా అందుకుంది. ప్రస్తుతానికి కొచ్చి వాటర్ మెట్రోలో హైకోర్టు, ఫోర్ట్ కొచ్చి, వైపీన్, బోల్గట్టి, ములవుకాడ్ సౌత్ చిత్తూరు, చేరనల్లూర్, ఎలంకుళం, వైట్టిల, కక్కనాడ్ సహా 10 టెర్మినల్స్‌లో 20 బోట్లు పనిచేస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి రాత్రి 9 గంటల వరకు కొచ్చి వాటర్ మెట్రో సర్వీసులు నడుస్తున్నాయి. రోజుకు 125 ట్రిప్పులు తిప్పుతున్నారు. కొచ్చి వాటర్ మెట్రో ప్రారంభించిన 107 రోజుల్లోనే మొదటి 10 లక్షల మంది ప్రయాణికులు నమోదయ్యారు. ఆ తర్వాత 95 రోజుల్లో 20 లక్షలు, 185 రోజుల్లో 30 లక్షలు, 160 రోజుల్లో 40 లక్షల మంది నమోదయ్యాయి. తదుపరి 161 రోజుల్లో 50 లక్షల మంది ప్రయాణికుల రికార్డును చేరుకుందని సంబంధిత అధికారి తెలిపారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కష్టాలు?

-మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ జారీ చేసిన అదనపు నోటీసులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చలకు దారితీశాయి. 2024లో బీఆర్ఎస్‌లోని పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఫిరాయింపు వివాదం మొదలైంది. ఎమ్మెల్యేలు ? పోచారం శ్రీనివాస్ రెడ్డి (బంస్వాడ), కల్యా యాదయ్య (చేవెల్ల), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికేపుడి గాంధీ (సేరిలింగంపల్లి), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట రావు (భద్రాచలం) ? బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచినా పార్టీ మారారు. బీఆర్ఎస్ నేతలు ఈ మార్పును ఫిరాయింపుగా భావించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఎటూ తేల్చకపోవడంతో గులాబీ నేతలు హైకోర్టు తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు జూలై 31, 2025 నాటి తీర్పులో స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడంతో ప్రక్రియ వేగపడింది. ఫిబ్రవరి 2025లో మొదటి నోటీసులు జారీ అయినప్పటికీ, ఎమ్మెల్యేలు తమకు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సమాధానాలు బీఆర్ఎస్ నేతలకు పంపబడిన తర్వాత, ఆ పార్టీ తరఫున జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్ వంటి నేతలు రీజాయిండర్లు సమర్పించారు.ఆగస్టు 2025 చివరిలో స్పీకర్ అదనపు నోటీసులు జారీ చేసి, మరిన్ని ఆధారాలు సమర్పించమని ఆరుగురు ఎమ్మెల్యేలు ? సంజయ్,



పోచారం, కలె యాదయ్య, తెల్లం వెంకట రావు, కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డిని ఆదేశించారు. ఈ నోటీసులు డిఫెక్షన్ చట్టం (10వ షెడ్యూల్) ప్రకారం విచారణను లోతుగా చేయడానికి ఉద్దేశించబడ్డాయి. స్పీకర్ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవేత్తల సలహాలతో ఈ చర్య తీసుకున్నారు, ఎందుకంటే మొదటి సమాధానాలు బీఆర్ఎస్ ఫిర్యాదులకు సంతృప్తి చెయ్యలేదు. ఈ అనూహ్య చర్య రెండు కారణాల వల్ల ఆసక్తికరంగా మారింది. ఒకటి, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న ఫొటోలు, విజ్ఞప్తులు వంటి ఆధారాలు. ఇవి బీఆర్ఎస్‌లోనే ఉన్నాము అనే వాదనను బలహీనపరుస్తున్నాయి. రెండు, స్పీకర్ ఈ విషయాన్ని సీల్డ్ కవర్‌లో పంపడం వల్ల విచారణ గోప్యతను కాపాడుతూ, రాజకీయ ఒత్తిడిని తగ్గిస్తోంది. బీఆర్ఎస్ నేతలు ఈ ఎమ్మెల్యేలను 'ప్రజల మండేట్‌ను ద్రోహం చేసినవారు'గా విమర్శిస్తున్నారు. ఉప ఎన్నికలకు డమాండ్ చేస్తున్నారు.మొత్తంగా ఈ పరిణామం కాంగ్రెస్‌కు సవాలుగా మారింది, ఎందుకంటే పది సీట్లు కోల్పోతే అసెంబ్లీ మెజారిటీకి ప్రభావితమవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని 'సాధారణ ప్రక్రియ'గా వర్ణించినప్పటికీ, ఎమ్మెల్యేలు న్యాయ సలహాలతో సమాధానాలు ఇవ్వాలని చెప్పారు. బీఆర్ఎస్ వర్గాలు ఇది 'అనైతిక రాజకీయాలకు' బహిరంగత్వం అని వాదిస్తూ, ఈ కేసు తమ పార్టీకి మార్గదర్శకంగా మారుతుందని ఆశిస్తున్నాయి.

# సిటీలో కేబుల్ కష్టాలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో నెల రోజులుగా ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్‌ను అధికారులు కత్తిరించడంతో ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేలాడే తీగలను తొలగించాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలు, ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల సచివాలయం వంటి కీలక సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యుత్ స్తంభాలపై సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవైన ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మరియు టెలిఫోన్ కేబుల్స్ ఉన్నాయి. ఈ కేబుల్స్ నగర జీవనానికి అత్యవసరమైనవి. అయితే, వేలాడే తీగలు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఇటీవల రామాంతాపూర్‌లో జరిగిన ప్రమాదం వంటి సంఘటనలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీని పరిష్కారంగా, కోర్టు ఆదేశాలతో అధికారులు కేబుల్స్‌ను తొలగిస్తున్నారు. కానీ, ఈ చర్యలు సమస్యను పరిష్కరించడానికి బదులు, సచివాలయం వంటి కీలక ప్రాంతాల్లో సేవల నిలిచిపోవడానికి దారితీశాయి. వర్క్ ఫ్రం హోం ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కేబుల్స్‌ను నిర్వహించే ఆపరేటర్లు లేదా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకోవడానికి బదులు, అధికారులు కేబుల్స్‌ను నేరుగా కత్తిరించడం ద్వారా ప్రజలకు సేవలను ఆపేస్తున్నారు. ఇది ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తోంది. టీవీ ప్రసారాలు నిలిచిపోవడం, ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడం, మరియు ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం కలగడం వంటి సమస్యలు





తలెత్తాయి. ఈ చర్యలు చిన్న వ్యాపారాలను మూతపడే పరిస్థితికి తీసుకొస్తున్నాయి.ఇంటర్నెట్, టెలీకమ్యూనికేషన్ సేవలు నీటి, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలుగా మారాయి. చట్టప్రకారం, బిల్లులు చెల్లించే ప్రజలకు ఈ సేవలు అందించడం సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత. అయితే, అధికారుల నిర్ణయాలు ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సుప్రీం కోర్టు కూడా ఇంటర్నెట్ సేవలను అంతరాయం కలిగించడం ప్రజల హక్కుల ఉల్లంఘనగా పరిగణించింది. అయినప్పటికీ, హైదరాబాద్‌లో ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.ఈ సమస్యకు పరిష్కారంగా, అధికారులు కేబుల్ నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వేలాడే తీగల సమస్యను పరిష్కరించడానికి కేబుల్స్‌ను సరిగ్గా నిర్వహించేలా నిబంధనలు అమలు చేయాలి, కానీ సేవలను నిలిపివేయడం సరైన పరిష్కారం కాదు. సమస్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా, ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చు. అలాగే, ఇంటర్నెట్ మరియు కేబుల్ సేవలను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

# జీరో పర్మిషన్‌తో ఎడా పెడా నిర్మాణాలు

**హైదరాబాద్ :** నిజాంపేట్ కార్పొరేషన్ లో అక్ర మార్కులు రెచ్చిపోతున్నారు. ఏలా నిర్మిస్తే మాకెవ్వడు అడ్డు అనేలా విర్ర వీగుతూ ఎడా పెడా అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారు.అంతంతా మాత్రమే అనుమతులు తీసుకొని అక్రమాల రాజ్యాలను నెలకొలపుతున్నారు.కమర్షియల్ భవంతులు ప్రమాద పుటంచున భవనాలు, అక్రమ షెడ్స్ నిర్మిస్తూ మున్సిపల్ ఆదాయానికి శఠగోపం పెడుతున్నారు.కళ్లేదుటే మున్సిపల్ ఆదాయానికి రూ. కోట్లు నష్టం చేస్తూ, పట్టణ ప్రణాళికను చిన్నా భిన్నం చేస్తూ ధర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కంట్రోల్ చేయాల్సిన మున్సిపల్ అధికార యంత్రాం గం చేష్టలుడిగి చూస్తూ కూర్చోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది.నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జీపీఆర్ లే అవుట్ లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు,పాక్షిక అనుమతు లు తీసుకుని కొందరు, అక్రమ షెడ్స్ వేస్తూ ఇంకొందరు ఇలా అక్రమ నిర్మాణాలు చేపడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడు తున్నారు.రూ. కోట్లలో మున్సిపల్ ఆదా యం అక్రమ నిర్మాణాలతో కోల్పోతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవ డం లేదు. ఇక్కడ ఓ బిల్డర్ హెచ్ఎండీఏ అనుమతులు తీసుకొని సుమారు 400 చదరపు గజాల విస్తీర్ణంలో రెండు భవంతులు నిర్మిస్తున్నాడు.ఈ భవంతులను హెచ్ఎండీఏ అప్రూవల్ ప్లాన్ ప్రకారం కాకుండా ప్లాన్ వైలేట్ చేస్తూ అక్రమ ఫ్లోర్స్ నిర్మాణం చేపట్టాడు.వాటర్ ట్యాంక్ సాకుతో మరో 2బీహెచ్కే నిర్మాణం కోసం స్లాబ్స్ వేసి వదిలేశాడు. హెచ్ ఎం డీ ఏ నుండి ఓసీ, మార్టిగేజ్ లు రిలీజ్ అయ్యా క సడీ సప్పుడు కాకుండా దొంగ చాటుగా మరో అక్రమ నిర్మాణం చేపట్టెందుకు కుయుక్తులు పన్నుతు న్నాడు.



ప్లాన్ ప్రకారం కాకుండా ఇలా ఎందుకు ఎక్స్ట్రా స్లాబ్స్ వేశావ్ అని మున్సిపల్ సిబ్బంది ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ తన ప్రాపర్ అప్రూవల్ ప్లాన్ షో చేయకుండా అధికారులకు సవాల్ విసురుతు న్నాడు.జీపీఆర్ లే అవుట్ లో మరో బిల్డర్ ఏ మాత్రం మున్సిపల్ అనుమతులు లేకుండా సుమా రు 250 చదరపు గజాల విస్తీర్ణం లో ధర్జాగా జీ +1 భవంతి నిర్మిస్తున్నాడు.ఇక్కడ ఆర్ఓ గా పని చేసి వెళ్లిన ఓ అధికారి ప్రస్తుతం పక్క మున్సిపాలిటీ లో కమిషనర్ గా విధులు చేపడుతున్నాడు.ఆ కమిషనర్ ఇక్కడి నిజాంపేట్ మున్సిపల్ అధికారులకు ఆ అక్రమ నిర్మాణం తనదే అక్కడికి వెళ్ళకండి అంటూ హుకుం జారీ చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు గప్ చుప్ గా ఉంటూ అక్రమ నిర్మాణంకు ప్రత్యక్ష సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే ప్రాంతంలో మరో బిల్డర్ సుమారు 200 చదరపు గజాలలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా జీ+2 బిల్డింగ్ నిర్మించి ధర్జాగా కమర్షియల్ షెటర్స్ ఏర్పాటు చేశాడు. ఈ భవంతి పై కోర్టు లో స్టేటస్ కో ఉన్నా చక చకా అక్రమ నిర్మాణం పనులు చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నాడు.అలాగే ఏడీఆర్ హై రైజ్ బిల్డింగ్స్ సమీపంలో సైతం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ షెడ్స్ నిర్మాణం ధర్జాగా చేపడుతూ అక్రమార్కులు రాజ్యం ఏలు తున్నారు.ఇలాంటి అక్రమ నిర్మాణాల పరంపర నిజాంపేట్ కార్పొరేషన్ లో నిత్యం చోటు చేసుకోవడం అధికారులు మౌనం వహించడం పై పలు ఆరోపణలు వెలువడుతున్నాయి.అయితే ఈ అక్రమ నిర్మాణలపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీవో వివరణ కొరకు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించడం లేదు.


## బతుకమ్మ వేడుకల్లో బండి ప్రభాకర్

**మహిళలు,నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని సంబరాలు..**



**బెల్లంపల్లి,సెప్టెంబర్21(సూర్యరేఖ)**బెల్లంపల్లిలోని 13వ వార్డు మాజీ కౌన్సిలర్,టీపీసీసీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమాన్ గుడి,గంగారాంనగర్ గవర్నమెంట్ స్కూల్, గంగారాంనగర్ అంగన్వాడి స్కూల్ వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.బండి ప్రభాకర్ మహిళలు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయించారు.ఎప్పుడూ ప్రజలకు అండగా నిలబడే ఆయనకు స్థానికులు ప్రశంసలు కురిపించారు.ఈ కార్యక్రమంలో 13వ వార్డు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను ఉల్లాసభరితంగా చేసారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలి..





**అందోల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** రాయికోడ్ మండలం కూసునూర్ వాగులో కృష్ణ ముదిరాజ్ కొట్టుక పోయారు.వివిధ సంఘాల నాయకులు అధికారుల నిర్లక్ష్యం వల్లనే వాగులో కొట్టుకపోయారని మండిపడ్డారు. తహసీల్దార్, పోలీసులు నిర్లక్ష్యం వల్లనే కృష్ణ వాగులో గల్లంతయ్యారని ఆరోపించారు.వివిధ గ్రామాల ప్రజలు,మండలం ప్రజలు,నాయకులు మండిపడ్డారు. ఈవిషయంపై జిల్లా ఎస్పీ,కలెక్టర్,లకు పిర్యాదు చేస్తామని తెలిపారు.

## పూలను,ప్రకృతిని పూజించే గొప్ప పండుగ మన బతుకమ్మ ..

**తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ..**
**ప్రజల ఐక్యతకు బతుకమ్మ పండుగ నిదర్శనం..**
**మైలార్ దేవ్ పల్లి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్**



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 17 (సూర్యరేఖ)** తెలంగాణ అస్తిత్వానికి,సాంస్కృతిక జీవనానికి తరతరాల ప్రతీక మన బతుకమ్మ అని మైలార్ దేవ్ పల్లి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాబుల్ రెడ్డినగర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ... తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి బతుకమ్మ తరతరాల ప్రతీకగా నిలిచిందని,పూలను దేవతగా కొలిచేదే బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు.ప్రపంచ సంస్కృతీ, సంప్రదాయాల్లో తెలంగాణ ప్రత్యేకతను చాటుతోందని తెలిపారు.పూలను,ప్రకృతిని పూజించే గొప్ప పండుగ మన బతుకమ్మ అని ఆయన కొనియాడారు.బతుకమ్మ పండుగ రాజేంద్రనగర్ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని కోరుకుంటూ...ప్రతి ఒక్కరికి ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎస్.వెంకటేష్ తెలిపారు.మన పండగ మన సంస్కృతిని చాటే చెప్పే పండగను గొప్పగా కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఎంగిలి పూల బతుకమ్మతో తొమ్మిది రోజుల పాటు తిరొక్క రంగులతో అడపడుచులు జరుపుకొని బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఔన్నత్యానికి ప్రతీకను చాటి చెప్పారని,సద్దుల బతుకమ్మ (పెద్ద బతుకమ్మ )పండగను వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.కష్టాలనుంచి రక్షించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని,ప్రకృతి మాత బతుకమ్మను ఎస్.వెంకటేష్ ప్రార్థించారు.

# ప్రకృతినే దేవతగా పూజించే పండుగ బతుకమ్మ పండుగ

**- రాష్ట్రంలో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు....**
**- వాడవాడలా ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు....**

**కొల్చారం,సెప్టెంబర్21(సూర్య రేఖ):** ప్రకృతిలో లభించే తీరొక్క పూలను వరుసలుగా పేర్చి,ప్రకృతినే దేవతగా పూజించే పండుగ బతుకమ్మ పండుగ. ప్రపంచంలో మరెక్కడాలేని రీతిలో తెలంగాణకే ప్రత్యేకమైన రంగురంగుల పూల పండుగ బతుకమ్మ.బతుకమ్మ అంటే బతుకు దెరువును మెరుగు పరిచే అమ్మ అని అర్థం.ప్రకృతి నుంచి సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించడం బతుకమ్మ పండుగ విశిష్టత. విభిన్నమైన పూలతో బతుకమ్మను చేసి, పూజించి తెలంగాణ ఆడపడుచులు ఆనందోత్సాహాలతో సంప్రదాయంగా,వేడుకగా జరుపుకునే పూల పండుగ బతుకమ్మ.తొమ్మిది రోజుల పాటు జాతర లా సాగే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల బతుకు తెరువును ఆవిష్కరిస్తుంది.ఆట పాటలతో సేద తీరుస్తూ,జీవన సంబరాన్ని ఆవిష్కరిస్తుంది. రాష్ట్రంలోని ఆడపడుచులు బతుకమ్మ పండుగను మహాలయ అమావాస్య నాడు అనగా నేటి నుంచి ఎంగిలి పూల బతుకమ్మతో మొదలు పెట్టి,తొమ్మిది రోజులు వివిధ పేర్లతో,నైవేద్యాలతో బతుకమ్మకు కొలుస్తారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకొని వాడవాడలా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

**ఎక్కువగా ప్రజలలో ప్రాచుర్యంలో ఉన్న కథానుసారం......**

పూర్వం భట్టునరసింహ అనే రాజు కవిచోళ దేశాన్ని పాలించేవాడు.ఆయన చాలా ధర్మాత్ముడు అతని భార్య సత్యవతి.ఒక యుద్ధంలో రాజు తన బంధుమిత్రులను కోల్పోయి,తన భార్య సత్యవతితో అడవులకు వెళ్లిపోయాడు.అనంతరం ఆయన మహాలక్ష్మీదేవి గురించి ఘోర తపస్సు చేయగా మహాలక్ష్మీదేవి కరుణించి సాక్షాత్కరించి ఏదైనా వరం కోరుకోమనగా,సంతానం లేక బాధపడుతున్న తమకు నీవే మా కుమార్తెగా జన్మించాలని వేడుకున్నాడు.కొంత కాలానికి సత్యవతి గర్భాన శ్రీమహాలక్ష్మీదేవి జన్మించిందని,ఆ బాలికను చూచి మునులు,ఋషులు ఎంతో సంతోషించి ఆయురారోగ్యాలతో బాగా బతుకమ్మ అని దీవించారని చెప్పుకుంటారు.ఆనాటి నుండి ఆమెను బతుకమ్మ అని పిలవసాగారని,బతుకమ్మ జన్మించిన కొంత కాలానికే రాజు తిరిగి తన రాజ్యాన్ని సంపాదించి,రాజ్యమేలాడని,ఆ రాజ్య ప్రజలు సుఖశాంతులతో ఎంతో ఆనందంగా జీవించసాగారని,బతుకమ్మ పెరిగి పెద్దదై,యుక్త వయస్సు వచ్చాకా శ్రీమహావిష్ణువే చక్రాంకుడు అనే రాజుగా వచ్చి,ఆమెను వివాహమాడాడని,ఆ దంపతులు ఎంతో కాలం సిరి సంపదలతో రాజ్య పరిపాలన చేశారని తెలంగాణ ప్రజలు కథగా చెప్పుకుంటుంటారు.తెలంగాణ ప్రజలు దసరా



పండుగ సమయంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారు.బతుకమ్మనే ఇక్కడి ప్రజలు బొడ్డెమ్మగా,గౌరమ్మగా భావించి,పూజలు చేస్తారు. ఒక పళ్ళెంలో రంగు రంగు పూలతో గుండ్రంగా ఎత్తుగా బతుకమ్మను పేర్చి,పసుపు ముద్ద చేసి,ఆ ముద్దను గౌరమ్మగా భావించి,బతుకమ్మ పై పెట్టి,దేవుని ముందు ఉంచి,పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించి,ఇరుగు పొరుగు స్త్రీలతో కలిసి వారు చేసిన బతుకమ్మలను ఒక్క చోటికి చేర్చి,అందరూ కలిసి లయబద్ధమైన అడుగులు వేస్తూ,చప్పట్లు కొడుతూ బతుకమ్మల చుట్టూ లయబద్దంగా పాడుతూ బతుకమ్మను ఆడుతూ అమ్మ వారిని కొలుస్తారు.తెలంగాణ సాంస్కృతిక జీవనా వైవిధ్యం ఇతర ప్రాంతాలకు భిన్నం. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే పరిమితమైన పండుగ బతుకమ్మ పండుగ. వర్షాకాలం ముగిసి,జలవనరులు సమృద్ధిగా నిండి,పూలు బాగా వికసించే కాలంలో బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. తంగేడు గునుగు కట్ల గుమ్మడి గన్నేరు,రుద్రాక్ష,బంతి,చేమంతి,బీర,కాకర వంటి పూలతో బతుకమ్మను అందంగా ముస్తాబు చేస్తారు.బతుకమ్మ పండుగ అన్ని రోజులు రాష్ట్రంలోని పల్లెలు,పట్నాలు పూల వనాలౌతాయి. బతుకమ్మ అంటే కేవలం ఆట మాత్రమే కాదు పాట కూడా,పాట లేని పండుగను ఊహించలేం బతుకమ్మ పాటలన్నీ తెలంగాణ బిడ్డల కష్టసుఖాలు కలబోతగా పేర్కొనవచ్చును. చరిత్ర,సంస్కృతుల మేలు కలయికగానూ బతుకమ్మ పండుగను పేర్కొంటారు.బతుకమ్మ పండుగ అంటేనే మహిళలకు ఒక సంబురం చిన్ననాటి స్నేహితులంతా కలుస్తారన్న నమ్మకంతో ఆడపిల్లలు తప్పకుండా తమ పుట్టింటికి వెళ్లడానికి ఆసక్తి చూపుతారు.

**తొమ్మిది రోజులు వివిధ పేర్లతో బతుకమ్మ...**

తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ పండుగలో ఎనిమిది రోజులు బతుకమ్మకు వివిధ పేర్లతో వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. మహాలయ అమావాస్య మొదటిరోజు బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మగా కొలచి,బతుకమ్మకు నువ్వులు బియ్యం పిండి నూకలు కలిపి నైవేద్యంగా పెడతారు.రెండవ రోజు బతుకమ్మను అటుకుల బతుకమ్మగా కొలచి,సప్పిడి పప్పు,బెల్లం అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.మూడవ రోజు బతుకమ్మను ముద్దపప్పు బతుకమ్మగా కొలచి,ముద్దపప్పు పాలు బెల్లంతో నైవేద్యం తయారు చేసి నివేదిస్తారు. నాలుగో రోజు



బతుకమ్మను నానే బియ్యం బతుకమ్మగా కొలచి,నానేసిన బియ్యం,పాలు,బెల్లం కలిపి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.ఐదో రోజు బతుకమ్మను అట్ల బతుకమ్మగా కొలుస్తు అట్లు లేదా దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు.ఆరవ రోజు అలిగిన బతుకమ్మ అని బతుకమ్మ సంబరాలు నిర్వహించరు.ఏడవ రోజు వేపకాయల బతుకమ్మగా కొలిచి,బియ్యం పిండిని బాగా వేయించి,వేపపండ్లుగా తయారుచేసి నైవేద్యంగా సమర్పిస్తారు.ఎనిమిదో రోజు బతుకమ్మ వెన్నముద్దల బతుకమ్మగా కొలచి,నువ్వులు,వెన్న లేదా నెయ్యి,బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు.తొమ్మిదో రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మగా కొలచి,పెరుగన్నం,చింతపండు పులిహోర కొబ్బరన్నం నువ్వులన్నం బియ్యం నువ్వులు,పల్లిలు,మక్కలు తదితర వాటితో సద్దులు తయారు చేసి ఐదురకాల నైవేద్యాలు అమ్మవారికి నివేదిస్తారు.తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పూజించిన మహిళలు చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తారు.తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మపై ఉంచిన పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మహిళలు తమ పుస్తెలకు అద్దుకుంటూ,ఇతర ముత్తైదువులతో పంచుకొని తమ భర్తలకు ఆపదలు తొలగి,తమ మాంగళ్యం చల్లగా చూడలని అమ్మవారిని కోరుకుంటారు. అదేవిధంగా కొంతమంది రొట్టె,రవ్వ,బెల్లం లేదా చక్కెర తో కలిపి తయారు చేసిన మలీదను అందరికీ పంచితే శుభం జరుగుతుందని మలీదలు అందరికీ పంపిణీ చేస్తారు.ఎంగిలి పూల బతుకమ్మతో ఆదివారం నుండి తెలంగాణ అంతటా బతుకమ్మ పండుగ మొదలైంది.ప్రకృతితో మమేకమై ఆట పాటలతో ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.పండుగ నాటికే ప్రకృతి అంతా పూలవనంగా మారుతుంది. ప్రకృతిలో సేకరించిన మాలను ప్రకృతికే సమర్పించడం అనే ఉద్దేశ్యంతో బతుకమ్మలను నీటిలో విడిచి పెడతారు.తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబిస్తూ రాష్ట్రంతో పాటు దేశ విదేశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుంది. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పల్లె పట్టణాలలో సందడి నెలకొంది.పట్టణాలలోని పెద్ద ఎత్తున వివిధ రకాల బతుకమ్మ పూల విక్రయాలు చేపట్టడంతో ప్రజలు పూల కొనుగోలకు బారులు తీరారు.

## ఎంగిలి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్



**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్య రేఖ):** నాచారం డివిజన్లో ఎంగిలిపూల బతుకమ్మ పండుగను డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ డివిజన్లోని కాలనీవాసులతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..9 రోజులపాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా అంబరంగా సంబరంగా జరుపుకోవాలని సూచించారు. బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆమె వెల్లడించారు. బతుకమ్మ నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**మందమర్రి,సెప్టెంబర్21(సూర్యరేఖ)** పువ్వులనే దేవతగా కొలిచి ఆడి పాడే పూల జాతర బతుకమ్మ పండుగను ఆదివారం మహిళలు ఆనందోత్సాహాలతో ఉత్సాహంగా జరుపుకున్నారు.ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని మహిళలు ఇంటిల్లిపాది ఉపవాసంతో ఉండి తంగేడు,గునుగు,టేకు,బంతి,చామంతి వంటి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,గుమ్మడి పూలతో గౌరమ్మను ప్రతిష్టించిన అనంతరం పూజ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ అందంగా తీర్చిన బతుకమ్మలను ఆడపడుచులు ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ ల వద్ద బతుకమ్మని ప్రతిష్టించి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళల చప్పట్లు బతుకమ్మ పాటలతో పట్టణం మారుమ్రోగింది. అనంతరం సమీపంలోని వాగులు,చెరువులో బతుకమ్మలను సాంప్రదాయబద్దంగా నిమజ్జనం చేశారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని

**నిహారికను అభినందించిన పలువురు ప్రముఖులు**



**అందోల్,సెప్టెంబర్21(సూర్య రేఖ)** ఎన్ని కష్టాలు చుట్టుముట్టినా సరే మనం అనుకున్నది ఎప్పటికైనా సాధించాలి అన్న సంకల్పం ఉంటే ఎంతటి కష్టాన్నైనా దాటి గమ్యాన్ని చేరగలమని నిరుపేద విద్యార్థిని నిహారిక.నీట్లో టాప్ ర్యాంకు సాధించి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించి సత్తాచాటింది.సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిపడ్ పల్లి మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పన్నిగారి మోహన్ సంగీత దంపతుల కూతురు నిహారిక.నీట్ యూజీ పరీక్ష క్రాక్ చేసి కుటుంబంలో అవధులు లేని ఆనందాన్ని నింపింది.నిహారిక నీట్ పరీక్షలో 720 మార్కులకు 419 స్కోర్తో విజయం సాధించింది.సెంట్రల్ ర్యాంక్ 1,79,700 రాగా స్టేట్ ర్యాంక్ 3,549 సాధించింది.నీట్ పరీక్షలో తన కుమార్తె విజయం సాధించడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.పన్నిగారి నిహారిక మీడియాతో మాట్లాడుతూ..ఇంటిలోని పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని,అయిన పగలనక రాత్రనక కష్టపడి చదివానని,ఓటమిని ఎప్పుడు ఒప్పుకోలేదని ఎంబీబీఎస్ డాక్టర్ గా పేదలకు వైద్య సేవలు అందిస్తానని తెలిపింది.

# నేటి నుండి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు


**జల్ పల్లి,సెప్టెంబర్17(సూర్యరేఖ)** బాలాపూర్ మండల,బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపల్లిలో వెలసిన అతి ప్రాచీనమైన శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నేటి నుండి వారం రోజుల వరకు బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ ఈవో మురళీకృష్ణ, ఆలయ.చైర్మన్ కళ్లెం నరేష్ గౌడ్ డైరెక్టర్లు చీమలదారి చెన్నయ్య,గొండ్యాల శేఖర్ ఎలిగపల్లి అనిత, కానుగల భాస్కర్,గురుజని రాధిక,ఉండేకారి సుధీర్ కుమార్ తెలిపారు.ఈ బ్రహ్మోత్సవాలు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు,భక్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు.మామిడిపల్లి శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అంకురార్పణ తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించి,23 మంగళవారం బాల భోగము, యాగశాల ప్రవేశము,విష్ణు సహస్ర పారాయణం నిర్వహించనున్నారు.24న బుధవారం 11 గంటలకు స్వామివారి తిరు కళ్యాణం,అన్న ప్రసాద



వితరణ ఉంటుందని,సాయంత్రం 6గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం హవనము శేష వాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.25,26, 27న బాల భోగము ఆవాహనము,బలి హోరము, మహా పూర్ణాహుతి చక్రతీర్థం,శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం,అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# ప్రధాని మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ లో రక్తదాన శిబిరం






ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణీందర్

**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంను ఉప్పల్ మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి,ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి,లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి భారతమాత చిత్రపటానికి పూలు వేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.తలసీమ వ్యాధిగ్రస్తుల చేయూత కోసం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి పెద్ద సంఖ్యలో యువకులు వచ్చి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మారినేని ఫణీంద్ర మాట్లాడుతూ... రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవాపక్షం లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, జన్మదిన వేడుకలు అటాసంగా కాకుండా పేద మధ్యతరగతి కుటుంబీకులకు వైద్య సేవలు వారికి అందించాలని నరేంద్రమోడీ తెలిపారన్నారు. అందుకే అందులో భాగంగా సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు డివిజన్లోని పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు.ఆదివారం దాదాపు 72 మంది రక్తదానం చేశారని వారికి భారతీయ జనతా పార్టీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు షామీర్పేట్ ధర్మారెడ్డి,డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్,నామ శ్రవణ్, కోశాధికారి దువ్వల రమేష్,ఉపాధ్యక్షులు భవిష్ ప్రసాద్,యువమోర్చా నాయకులు ఆకుల రిషి ఆడెపు రమేష్ ,సీనియర్ నాయకులు చోలేటి బ్రహ్మచారి,మీసాల జంగయ్య,గౌరిగ వెంకటేష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,మద్దెల పద్మ,మంగా శరత్ ముదిరాజ్,స్రవంతి,వెంకట్ సాయిముదిరాజ్ జయరాం నవీన్ అరుణ్ అభిరామ్,రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరులను స్మరించుకుంటూ పెద్దలకు బియ్యం






**అమరుల త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయి..**
**అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలి..**
**ఉద్యమకారులకు గుర్తింపునివ్వాలి..**
**తెలంగాణ బతుకు పోరాటమే"బతుకమ్మ**

**హైదరాబాద్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలను భవిష్యత్తు తరాలకు అందించడమే పెత్తర మాస రోజు అమరులకు బియ్యమిచ్చే కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయపడ్డారు.తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య అధ్యక్షతన గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు బియ్యమిచ్చే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతాచారి యాదయ్య వంటి విద్యార్థుల బలిదానాల త్యాగఫలమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని అన్నారు.వారి త్యాగాలను పోరాటాలను భవిష్యత్తు తరాలకు అందించడమే తమ ప్రధాన ఉద్దేశం అని ఆయన తెలిపారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు 25వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రక్రియను ప్రారంభించాలని ఈ సందర్భంగా కోదండరాం ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ బతుకు పోరాటమే బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి కార్మిక విభాగం కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, బీసీ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జస్వంత్ కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, ఆషప్ప,తెలంగాణ ఉద్యమకారులు ఆనందం బండి రమేష్,ఆర్టీసీ జేఏసీ లాలయ్య జనసమితి నాయకులు భద్రగామ ఆంజనేయులు హనుమంతు రెడ్డి,విజయ్ కుమార్ తిరుమల్ రవికాంత్,బట్టల రామచందర్ బాలరాజు జహీర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్,జైపాల్ రెడ్డి లక్ష్మణ్ సురేష్,రమేష్, హనుమంతుగౌడ్ మాణిక్యం ఇస్మాయిల్,రసూల్, సుధాకర్ నాగభూషణం యాదగిరి కృష్ణ,బల్వంతు రాజు శేఖర్ మురళి అంజి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశివ శంకర మహామాయి దేవాలయం,మహామాయి దేవి విశేషపూజలు,అన్న ప్రసాద వితరణ





**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** ఉప్పల్ లోని శ్రీశివశంకర మహామాయి దేవాలయంలో భద్రపద మాస మహాలయ అమావాస్య సందర్భంగా అమ్మవారి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పోజి బలవంత చారి బిక్షపతి రాజగోపాలచారి శ్రీనివాస్, విజయ్ ప్రశాంత్ పవన్ చోల్లేటి బ్రహ్మచారి శ్రీనివాస్ శ్రీధర్ ప్రణవ్ రోహన్ పాలేర్ల గోపి సతీష్ శ్రీనివాస్ దాసోజు ప్రవీణ్ శ్రీనివాస్,డివిజన్ అధ్యక్షులు పనేంధర్ శామీర్పేట్ హనుమంత్ రెడ్డి,ఆకుల ఋషికేష్ నమ శ్రవణ్ శరత్ శ్రీనివాస్ గౌడ్ దువ్వ రమేష్ కృష్ణరెడ్డి,పాలకూర్ష శ్రీనివాస్,నటరాజ్ సాగర్ ప్రవీణ్ కృష్ణరెడ్డి జగన్ యాపురం శ్రీనివాస్ గుండాల అనిల్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,నర్సింహా చారి,తీగ విట్టల్ రావు,నర్సింగ్ రావు,తురాయి దాస్,మహేష్ జగన్ బిక్షపతి రామ్ ప్రకాష్,గోపి చారి పసుపు నేటిరమేష్ వెంకటయ్య కుమార్ భాస్కర్ చారి పాపయ్యగౌడ్ గురువయ్య గౌడ్,రాజు సందీప్,మహేష్ కుమార్,భవాని శంకర్ లక్ష్మణ్ సంతోష్ కుమార్ బంటి శ్రీను శ్రీనివాస్ గౌడ్ గణేష్ గౌడ్,యదిగౌడ్ వెంకటేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలించిన తెలంగాణ జాగృతి జిల్లా నాయకుడు పుల్లూరి మౌనిక్



**బెల్లంపల్లి,సెప్టెంబర్21(సూర్యరేఖ)**ఈ నెల 23వ తేదీన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బతుకమ్మ పండుగలో పాల్గొని ఆడటానికి శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంకు రానున్నారు.ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను తెలంగాణ జాగృతి జిల్లా నాయకుడు పుల్లూరి మౌనిక్ పరిశీలించారు.ఈ సందర్భంగా మౌనిక్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక.ఈ వేడుకను అఖండ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ముఖ్యంగా మహిళలు భారీగా తరలి వచ్చి,కవితతో కలిసి బతుకమ్మ ఆడి ఈ పండుగ మహోత్సవాన్ని ఘనంగా జరపాలి"అని పిలుపునిచ్చారు.ఆయన వెంట ఈట రాకేష్,రత్నాకర్ రెడ్డి,బండారి రేవంత్, మున్నా,వినయ్,సాయి,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ కిరణ్ తల్లి ప్రధమ వర్ధంతికి హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్..



**హైదరాబాద్,సెప్టెంబర్ 21(సూర్యరేఖ)** ఎన్ఆర్ఐ కిరణ్ తల్లి సావిత్రమ్మ ప్రధమ వర్ధంతి కార్యక్రమం సోమాజిగూడలోని ఓ ప్రైవేటు హొటల్లో నిర్వహించారు.కార్యక్రమంకి హాజరైన హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్, ఎన్ఆర్ఐ శ్రీధర్,విజయ భాస్కర్,గడ్డం రవికుమార్ తదితరులు హాజరై సావిత్రమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.సావిత్రమ్మ ఆత్మ శాంతికు చేకూరాలని ప్రార్థించారు.ఎన్నారై కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రాహుల్ యాదవ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేసింది..

**కంది శ్రవణ్ కుమార్ రెడ్డి**



**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)**హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డినగర్ లో నివాసం ఉండే రాహుల్ యాదవ్(23)విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందడంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతిక గాయానికి నివాళులర్పించారు.అతి చిన్న వయసులో రాహుల్ యాదవ్ మృతి చెందడం బాధాకరమైన విషయమని అన్నారు.వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో షబ్బీర్ హరీష్ దీపక్ అద్నాన్ బంటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు



**ఉప్పల్,సెప్టెంబర్21 (సూర్యరేఖ)** ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి మాజీ రాజ్య సభ సభ్యులు వి.హనుమంతరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిపిసి సెక్రటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వైద్యంపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలి




ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుంది. కలెక్టర్..
-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**నిజాంపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)** సర్కారు దవాఖానాల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ఈ మేరకు రామాయంపేట మండల పరిధిలో డి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రక్త పరీక్షల గది,ఎక్స్ రే,ల్యాబ్ గదులను పరిశీలించారు.ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఎవరెవరు ఏరుగ్మతతో వచ్చారని వాకబు చేశారు.ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలు ఇప్పటి వరకు జరిగిన ప్రసవాల వివరాలను చూశారు. మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ చికెన్ గున్యా తదితర వ్యాధుల నమోదు సాధారణ ప్రసవాలు సిజరిన్లు ఎన్ని జరిగాయని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వసతి సౌకర్యాలతో పాటు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లు అవుతుందన్నారు. ప్రజారోగ్యం కాపాడటంలో వైద్యులు చిత్త శుద్ధితో వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతి ధర్మారం హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించిన ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్




**ఉప్పల్,సెప్టెంబరు21(సూర్యరేఖ)** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ తీగలు ఇళ్ళకు అనుకొని,ఉండటం వల్ల ప్రస్తుత వర్షాకాలంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని,ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆదివారం విద్యుత్ తీగలను మార్చి కేబుల్ వైర్లను మార్చాలని ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించారు.డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డినగర్,నవరంగ్ గూడ వాసవి నగర్ కాలనీ వాసుల పిర్యాదును దృష్టిలో పెట్టుకొని వెంటనే సమంధిత అధికారులతో మాట్లాడిన అరుణ్ పటేల్ పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరిగింది.హబ్సిగూడ డివిజన్ లో వెంకట్ రెడ్డి రెడ్డినగర్,నవరంగ్ గూడలో బిల్డింగ్,లకు ఆనుకొని మెయిన్ వైర్ ఉండడంతో వర్షాల కారణంగా షాక్ సర్క్యూట్ వస్తుందని బస్తీ వాసుల తెలియచేయడంతో మన యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ వెంటనే స్పందించి ఆ పరిసరాలకు వెళ్లి పరీక్షించి అధికారులకు వివరించి కేబుల్ వైర్ వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కిషోర్,చేవెళ్ళి,డిఎన్ సంతోష్, కె.రంజిత్ పవన్ బంగారం బి.వెంకటేష్ శ్రీనుచోట నగేష్ రాములతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**నారాయణపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంత్ మట్ట మూల మహా సంస్థానం శక్తిపీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుండి ప్రారంభంకానున్నట్లు పూజ్య డాక్టర్ శాంతానంద పురోహితులు తెలిపారు. శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీబాలా త్రిపుర సుందరి శ్రీగాయత్రీ దేవి,శ్రీఅన్న పూర్ణా దేవి,శ్రీకాత్యాయనీ దేవి,శ్రీలలితా త్రిపుర సుందరి శ్రీశాకాంబరి దేవి శ్రీమహాలక్ష్మి దేవి శ్రీసరస్వతి దేవి,శ్రీదుర్గాదేవి శ్రీమహిషాసుర మర్దిని,శ్రీరాజ రాజేశ్వరి దేవి అలంకరణలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు ఆయన తెలిపారు.కాగా ప్రతి రోజు ఉట్కూరు శివానంద్ పురోహిత్, పూజ్యశ్రీ డాక్టర్ శాంతానంద పురోహిత్,బ్రహ్మశ్రీజోషి రఘు ప్రేమాచారి,ఇరు వింటి శ్రావణ్ కుమార్,బ్రహ్మశ్రీ తోటపల్లి శ్రీకాంత్ శర్మ, బ్రహ్మశ్రీ కరణం రాఘవేంద్రచారి బ్రహ్మశ్రీశాస్త్రుల ప్రాణేష్ పూజారి,కా ర్తిక శర్మ,బ్రహ్మశ్రీ గంగాపురం పవన్ కుమార్ శర్మ బ్రహ్మశ్రీ రాఘవేంద్ర నారాయణాచార్యులచే ప్రతి రోజు ప్రవచనకర్తలు ఉంటాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.


## ఘనంగా పెత్తర అమావాస్య బతుకమ్మ వేడుకలు..



**నిజాంపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)**మండల వ్యాప్తంగా పెత్తర అమావాస్య సందర్భంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో మహిళలు గాంధీ వద్దకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.పెత్తర అమావాస్యను ఎంగిలిపూల బతుకమ్మ అని కూడా అంటారని,ఈ పండుగను తెలంగాణ సాంస్కృతికి ప్రతీక పకృతిని ఆరాధిస్తూ గౌరమ్మను పూజించి పువ్వులతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆటపాటలతో పండుగ వేడుకలు జరుపుకుంటామని తెలిపారు.అనంతరం స్థానిక గడిమ్ చెరువులో బతుకమ్మ బొడ్డెమ్మలను గంగమ్మ ఒడిలోకి సాగనంపారు.

## నేటి నుంచి శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు..

ఆలయ కమిటీ చైర్మన్ బండారు వెంకట్రావు



**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** రామంతపూర్ మెయిన్ రోడ్ శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం నుండి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతున్నట్లు ఆలయ చైర్మన్ బండారు వెంకట్రావు తెలిపారు.పది రోజుల పాటు ప్రతిరోజు అమ్మవారు వివిధ ఆభరణాలతో, వైవిధ్యమైన అలంకార రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు.భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించి,అమ్మవారి అనుగ్రహం పొందవలసిందిగా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు. ప్రతిరోజు అలంకరణ రూపాలను సామాజిక మాధ్యమాల ద్వారా మీకు పంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేవాలయ ప్రత్యేక పూజలు, కార్యక్రమాల కోసం ధన సహాయం,వస్తు సహాయం, శ్రమదానం,భక్తి రూపంలో అందిస్తున్న సహకారం, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని భక్తులు ఈ ఫోన్ నెంబర్ 9866612662, 6309665666లలో సంప్రదించి పూజ వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## సోమవారం ప్రజావాణి రద్దు..

**నారాయణపేట,సెప్టెంబర్ 21(సూర్యరేఖ):** సోమవారం (నేటి)ప్రజావాణి రద్దుపరిపాలనకు సంబంధించి జిల్లా అధికారులందరితో సోమవారం ఉదయం 11.30 గంటలకు సమీక్షా సమావేశం ఉన్నందున సోమవారం (నేడు) జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున జిల్లా ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలపరిష్కారం కోసం అర్జీలు తీసుకుని ఎవరూ కలెక్టరేట్ కు రావొద్దని కోరారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన వివేకానంద విద్యార్థి..



**రామాయంపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వివేకానంద విద్యాలయానికి చెందిన విద్యార్థిని పి.వర్షిని తన ప్రతిభను చాటింది.9వ తరగతి చదువుతున్న ఈవిద్యార్థిని అండర్-17 బాలికల విభాగంలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు త్వరలో జరగనున్న నేపథ్యంలో,ఉమ్మడి మెదక్ జిల్లాను ప్రతినిధ్యం వహించే క్రీడాకారిణిగా వర్షిని ఎంపిక కావడం స్థానికంగా గర్వకారణమైంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రామ్‌కుమార్ మాట్లాడుతూ...' 'విద్యార్థిని వర్షిని ప్రతిభతో పాటు కృషి కూడా సమన్వయం చేస్తూ రాష్ట్రస్థాయిలో విజయం సాధిస్తుందనే నమ్మకం మాకు ఉందన్నారు. ఆమెకు సహకరించిన పీఈటీల కృషి ప్రశంసనీయం. రాష్ట్రస్థాయిలోనూ విజయాన్ని సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలోని క్రీడాభిమానులు కూడా వర్షిని రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

# శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథయాత్ర పూజా కార్యక్రమాలకు హాజరైన ఎంపీడీ.కే.అరుణ.

**నారాయణపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి,భవాని మాత బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమావాస్య దినమున శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి వెండి రథం శ్రీశ్రీ శ్రీవీర ధర్మజమాత చిత్రపట రథాన్నివిజయ సాయి కాలనీలోని ఏవి మందార నివాసం నుండి రథయాత్ర ప్రారంభం అయ్యింది. ఈరథయాత్రలో ఎంపీ డీ.కే. అరుణ పూజా కార్యక్రమాలు హారతి నిర్వహించి ప్రారంభించారు.ఈరథ యాత్ర సాయి విజయ్ కాలనీ నుండి పాతబస్టాండ్,సుభాష్ రోడ్,మధ్యల బీడ్ దామరగిద్ద,గడ్డి మున్నన్ పల్లి,కాన్ కుర్తిమీదుగా యానగుందిలోని సూర్యనంది క్షేత్రానికి చేరుకుంటుంది.ఈ కార్యక్రమంలో రతంగు పాండు రెడ్డి,సత్యయాదవ్ సత్యరఘుపాల్ రెడ్డి,బండి శివరాంరెడ్డి,బండి



రాజెశ్వరి లక్ష్మి,శ్యాంసుందర్ గౌడ్, మాధవరెడ్డి సతీష్ గౌడ్,లతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రక్తదానం చేసే వారికి గుండె జబ్బులు,క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ..

**ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు..**




**కామారెడ్డి సెప్టెంబర్21(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రం లోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో పట్టణానికి చెందిన మురికి రాజు మానవత దృక్పథంతో స్పందించి రక్తాన్ని అంద జేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ...ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సర్వేల ప్రకారం ప్రతి సంవత్సరం రక్తదానం చేసే వారికి గుండెచప్పుడు క్యాన్సర్ కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి అని తెలియజేయడం జరిగిందని అన్నారు.దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి సకాలంలో రక్తం అందకపోవడంతో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని మానవతదృక్పథంతో స్పందించి రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు.రక్తదానం పైన ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు.

## ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న సఫైర అపార్ట్మెంట్ అధ్యక్షురాలు చైత్రికరెడ్డి



**శంకర్ పల్లి,సెప్టెంబర్ 21(సూర్యరేఖ)** శంకర్ పల్లి మండల పరిధి మోకిలా గ్రామంలో సఫైర్ అపార్ట్మెంట్లో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో ముఖ్యఅతిథిగా అపార్ట్మెంట్ అధ్యక్షురాలు చైత్రిక రెడ్డి పాల్గొని తెలంగాణ ఆడపడుచులందరికి ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత వారు మాట్లాడుతూ...పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే వేడుక అని తెలిపారు. తెలంగాణ గ్రామీణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని తెలిపారు.ఈ పండుగను తెలంగాణ రాష్ట్రంలో భాద్రపదమాస అమావాస్య నుండి తొమ్మిది రోజులపాటు తీరొకపువ్వులతో బతుకమ్మను పేర్చి మహిళా తల్లులందరూ పట్టువస్త్రాలు ధరించి,చిన్నలు పెద్దలు అనే తేడా లేకుండా,మహిళలందరూ ఆడుతూ పాడుతూ గౌరమ్మను పూజిస్తూ,చివరి రోజు నీటిలో నిమజ్జనం చేస్తారు.పూర్వం నవాబులు భూస్వాము లు పెతందారుల చేతులలో భూమికోసం భుక్తి కోసం ఎంతోమంది మహిళలు మానప్రాణాలతో అసువులు భాశారు.వారికీ ప్రతికగా తోటి మహిళలను బ్రతికించుకోవడానికి ప్రకృతిలోని తీరొకపువ్వులను పేర్చి గౌరమ్మను బతుకమ్మ బతుకమ్మ అని కొలుస్తూ బతికించుమని వేడుకున్న తంతే ఈపండుగ అని తెలిపారు.


## ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న సఫైర అపార్ట్మెంట్ అధ్యక్షురాలు చైత్రిక రెడ్డి



**శంకర్పల్లి,సెప్టెంబర్21(సూర్య రేఖ)** శంకర్పల్లి మండల పరిధి మోకిలా గ్రామంలో సఫైర్ అపార్ట్మెంట్లో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపార్ట్మెంట్ అధ్యక్షురాలు చైత్రిక రెడ్డి పాల్గొని తెలంగాణ ఆడపడుచులందరికీ ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ.. పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే వేడుక అని తెలిపారు.తెలంగాణ గ్రామీణ సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని వ్యాఖ్యానించారు.ఈ పండుగను తెలంగాణ రాష్ట్రంలో భాద్రపదమాస అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి మహిళా తల్లులందరూ పట్టువస్త్రాలు ధరించి,చిన్నలు,పెద్దలు అనే తేడా లేకుండా,మహిళలందరూ ఆడుతూ పాడుతూ గౌరమ్మను పూజిస్తూ,చివరి రోజు నీటిలో నిమజ్జనం చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో మౌనిక రెడ్డి,మనిలా రెడ్డి,లక్ష్మిరెడ్డి,ప్రియారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం..

**యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వగ్గు కుమార్ సాగర్..**



**అక్కన్నపేట,సెప్టెంబర్21(సూర్యరేఖ)** అక్కన్నపేట గ్రామానికి చెందిన శకుని రామవ్వ అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషాద సమయంలో వారి కుటుంబాన్ని పరామర్శించిన అదే గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వగ్గు కుమార్ సాగర్ ఆర్థిక సహాయం అందించారు.దీంతో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంక్షోభ సమయంలో తోడుగా నిలిచిన సాగర్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా వగ్గు కుమార్ సాగర్ చూపిన సహానుభూతిని అభినందించారు.

## చెరువు కట్టల వద్ద భారీ బందోబస్తు

**రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజా గౌడ్**



**రామాయంపేట,సెప్టెంబర్21(సూర్య రేఖ)** రామాయంపేట పట్టణంలో బతుకమ్మ పండగ సంబరాల నేపథ్యంలో రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజాగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.అందులో భాగంగా పట్టణంలోని సర్వాయికుంట మల్లన్న కమాన్ మల్లె చెరువు కట్ట ప్రధాన కూడళ్ల వద్ద వివిధ చెరువులకు మహిళలు బతుకమ్మలు తీసుకొని నిమజ్జనానికి వెళ్లే మార్గంలో పోలీసులు ప్రధాన రహదారి వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.అదేవిధంగా వాహనాలు వెళున్న సమయంలో మహిళలు రోడ్డు దాటుతుండగా ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా పోలీసులు వాహనాలను ఆపి మహిళలను రోడ్డు దాటించారు.మహిళలు బతుకమ్మలను తీసుకొని వెళ్లే వారిని వచ్చేవారిని చెరువుల వద్ద మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని రోడ్డు దాటుతుండగా అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తగా రోడ్డు దాటి వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పంప్ హౌస్ ను పరిశీలించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నాగల్ గిద్ద,సెప్టెంబర్21(సూర్యరేఖ)** గూడూరులో పంప్ హౌస్,ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మండల పరిధిలోని గూడూర్ గ్రామంలోని పంప్ హౌస్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఎమ్మెల్యే ఆదివారం. పరిశీలించారు..ఈ సందర్భంగా మోటర్ పనితీరును ఆయన పరిశీలించారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ...గ్రామాల్లో తాండలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు..ఆయన వెంట అధికారులు నాయకులు పాల్గొన్నారు. గూడూరులో పంప్ హౌస్ పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధికారులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మండల పరిధిలోని గూడూర్ గ్రామంలోని పంప్ హౌస్.ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా మోటర్ పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ... గ్రామాల్లో తాండలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి పత్రిక,మన ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ





**కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్**

**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీ,రాఘవేందర్ నగర్ కాలనీలో జరిగిన ఎంగిలి పూల బతకమ్మ సంబరాలలో కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.అనంతరం గీతా ప్రవీణ్ మాట్లాడుతూ...తిరొక్క పూలను అందంగా పేర్చి ఆటపాటలతో పూలను పూజించే అపురూప వేడుక మన బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. నేటి నుంచి మొదలయ్యే బతుకమ్మ వేడుకలను ఆడబిడ్డలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ...తెలంగాణ ప్రజలందరికీ ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక,నూతన అధ్యక్షులుగా వి.వెంకటరావు




**నాంపల్లి,హైద్రాబాద్, సెప్టెంబర్21 (సూర్యరేఖ)** బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం పాలక మండలి ఎన్నికలు ఎన్నికల అధికారి సలీం ఆధ్వర్యంలో జరిగాయి. ఉపాధ్యక్షులుగా ఎన్నికల ఇంఛార్జిగా కొనసాగిన మల్లికార్జున్ అడ్కీ, ఎన్నికల అధికారి సలీం అధికారికంగా గెలుపొందిన వారి వివరాలను ప్రకటించారు. బాలాజీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా వి.వెంకటరావు ఉపాధ్యక్షులుగా వి.వెంకట రమణ,ప్రధాన కార్యదర్శిగా సామ సురేందర్రెడ్డి, జాయింట్ కార్యదర్శి జి.సంతోష్ కోశాధి కారిగా మామిడి వెంకటేశ్వర్లు ఎన్నికైనట్టు ప్రకటించి నియామక పర్వతాలను అందజేశారు. బాలాజీ నగర్ కాలనీసంక్షేమ సంఘం అధివృధిని కాంక్షిస్తూ అభివృధి కోసం పనిచేస్తున్న ప్రముఖులు ఎస్.రామా రెడ్డి,వేణుగోపాల శర్మ ఎం.మాధవ రెడ్డి,కిషన్ సింగ్ మహిళామణులు జి.ఉష వెంకటేశ్వరి జి,కవిత,ఎస్.వసుమతి భారతి నిలిచారు నూతన పాలక వర్గాన్ని అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు తీసుకువచ్చిన రెండు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





**రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ముస్లిం మైనార్టీ మహిళలు**

**ఉప్పల్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రెండు కొత్త స్కీమ్,లు ఇంద్రమ్మ మైనార్టీ మహిళ యోజన, రేవంతన్న కాసహారా పథకాలను సద్వినియోగం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మంద ముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ ముస్లిం మైనార్టీ మహిళలతో కలిసి రామంతాపూర్ ఇంద్రనగర్ మజీద్ దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రఫీక్ మాట్లాడుతూ...రెండు కొత్త పథకాలు ముస్లిం మహిళా వితంతువులు విడాకులు పొందిన వారు అనాధలు వివాహిత మహిళల కోసం ఇంద్రమ్మ మైనార్టీ మహిళా యువజన పథకం ఈ పథకం కింద రూ.50వేల చొప్పున సాయం అందనుంది. రేవంత్ అన్న కాసహారా మీస్కిన్ కేలియే స్కీమ్ కింద ప్రభుత్వం ఫకీర్ దూదేకుల వర్గాలకు మేఫ్రెండ్ వెహికల్స్ అందించనుంది. ఈ స్కీం కింద ఒక్కొక్కరికి రూ.లక్ష గ్రాంట్ మంజూర్ చేయనుంది. కనుక ముస్లిం మైనార్టీ మహిళలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముస్లిం మహిళలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంధ్యారాణి ఇంద్రమ్మ కమిటీ మెంబర్ గాయత్రి,షేక్ టాబ్బుస్సుమ్,షేక్ సమరీన్ ఫోజియా,షేక్ అస్మా, షేక్ ఆఫ్రీన్,మహమ్మద్ జాకరియా,ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ షకీల మహమ్మద్ నయీమ్,అబ్దుల్ మతిన్,ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ చిన్న,మహమ్మద్ మోసిన్,మహమ్మద్ సాదిక్,ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి స్వామి సూరి, ఐకాన్ మధు సుధాకర్ గుప్తా,ప్రసాద్ పాండాసాయి ఇంద్రనగర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పుట్టిన రోజు వేడుకలు





**పేదలకు అన్నదాన కార్యక్రమం**

**మందమర్రి,సెప్టెంబర్ 21(సూర్యరేఖ)** మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు 65వ జన్మదిన వేడుకలను టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తా ఆవరణలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పుట్టిన రోజును పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,పీఎస్ఆర్ కార్యకర్తలు అభిమానుల మధ్య టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల,ప్రజల ఆపద్బాంధవుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అని అన్నారు. ఆయన నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండి నిరుపేదలకు కార్యకర్తలకు మరెంతో సేవ చేయాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఇంద్రవెల్లి సభను లక్షమందితో నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో పునరుజ్జీవం పోసిన మహా నాయకుడు ప్రేమ్ సాగర్ రావు అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతంచేసి మూడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు కృషి మరువలేనిదన్నాని గుర్తు చేశారు. భగవంతుని ఆశీస్సులు,ప్రజల అండదండలతో మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎండి ముజాహిద్, చెన్నూరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి నయీం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధం జనార్ధన్,జిల్లా ప్రధాన కార్యదర్శి రేవల్లి శ్రీకాంత్,జాడీ రాజేందర్,అరకల సతీష్ నరేందర్, ఎస్ఎం కోఆర్డినేటర్ రంజిత్ నవీన్ అనిరుధ్,పత్తి సురేష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల పండుగలకు రాయితీలు.. హిందువుల పండుగలకు ఆర్థిక భారమా.!

**గున్నాల రంగారెడ్డి.**

**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్ 21(సూర్యరేఖ)** దసరా సందర్భంగా హిందువులపై పెను భారం మోపడం తగదని,ముస్లింల పండుగలకు రాయితీలు హిందువుల పండుగలకు ఆర్థిక భారమా?అని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ...దసరా పండుగకు హిందువులపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని వేయడం తగదని,హిందువుల పండుగలకు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం అదనపు భారం మోపడం తీవ్రంగా తప్పుపడుతున్నామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో విపరీతమైన బస్సు చార్జీలు పెంచి,పేద ప్రజలకు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల పండుగలకు రాయితీలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం,హిందువుల పండుగలకు పన్నుల మీద పన్నులు వేసి తీవ్ర బారం మోపుతున్నారని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే ఈచర్యను ఉపసహరించుకోవాలని గున్నాల రంగారెడ్డి డిమాండ్ చేశారు. దసరా పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లే హిందువులపై ఆర్థిక భారం వేయడం క్షమించరాని నేరం అన్నారు. ప్రభుత్వం పండగల సందర్భంగా రాయితీలు ఇవ్వాల్సింది. పోయి రాక్షసంగా వ్యవహరించడం ఏమాత్రం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దసరా పండగ సందర్భంగా పెంచుతున్న ఆర్టీసీ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని,లేని పక్షంలో హిందువుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువులు రిటన్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అని పట్నం,పల్లె,ఊరు,వాడ ప్రజానీకం,తెలంగాణ రైతాంగం యూరియా దొరక్క10 ఏండ్ల కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.



## మహాలయ అమావాస్య...



**కొల్చారం,సెప్టెంబర్ 21(సూర్యరేఖ)** భాద్రపద మాసంలో పూర్ణిమ తరువాత వచ్చే పౌద్యమిని వదులుకుని అమావాస్య వరకు ఉండే పది హేను రోజులని మహాలయ పక్షములు అని అంటారు. ఎమ్మెల్యే సునితారెడ్డి గోమారంలోని ఆమె నివాసంలో వారి పెద్ద కుమారునితో కలిసి శ్రాద్ధకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని దర్భలు చేతిలో పట్టుకొని పిత్రు దేవు ల్లకు నల్ల నువ్వులను తిలోదకాలుగా పెద్దలకు తర్పణాలు వదిలారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో ఎంగిలిపూల బతుకమ్మ సందడి



**బెల్లంపల్లి,సెప్టెంబర్21(సూర్య రేఖ)**తెలంగాణ సాంప్రదాయ పండుగలలో ప్రత్యేక స్థానం కలిగిన ఎంగిలిపూల బతుకమ్మ పండుగను అత్యంత ఉత్సాహంగా,సంప్రదాయ పద్ధతిలో బెల్లంపల్లి మహిళలు ఆడుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు,టీపీసీసీ రాష్ట్ర ప్రచారం కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సతీమణి సంధ్యారాణి తన కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని అందరిని ఆకట్టుకుంది. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మను నృత్యాల మధ్య స్త్రీలు ఎంతో ఆనందంగా ఆడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించారు. స్థానిక మహిళలు,కుటుంబాలు వేడుకలో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చారు. తెలంగాణ సంప్రదాయాన్ని కాపాడుతూ కొత్తతరానికి ఈ సంస్కృతిని పరిచయం చేయడం గొప్ప విషయం అని పలువురు అభిప్రాయపడ్డారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి..

**అఖిలభారత పద్మశాలి ప్రధానకార్యదర్శి రచ్చ శ్రీనివాస్**



**జల్ పల్లి,సెప్టెంబర్17(సూర్యరేఖ)** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అఖిలభారత పద్మశాలి ప్రధానకార్యదర్శి రచ్చ శ్రీనివాస్ అన్నారు. యాదగిరిగుట్ట అఖిలభారత పద్మశాలి అన్న సత్రం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ...ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుడు నిరంకుశ నిజాం నిరంకుశ పాలనను, వదిలించుటకు నిప్పుకణికలా రగిలిన అవిశ్రాంత ఉద్యమ జ్వాలా జ్వలనుడు,తెలంగాణ విముక్తి కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యజించిన త్యాగధనుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. వంచిత బహుజన ఆత్మగౌరవ గొంతుక,స్వాతంత్ర్యోద్యమ గీతిక,మనందరికి స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్న సత్రం ఉపాధ్యక్షులు చుంచు నాగభూషణం,శ్రీధర్ కో డ్లే, కోశాధికారి బడుగు మల్లేష్,సహాయ కార్యదర్శి గుజ్జ బలరాం,పట్టణ సంఘం అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేష్,ధర్మకర్తలు భోగ పురుషోత్తం,గుజ్జ నిర్మల,కైరం కొండ మధు, బొమ్మ సూర్యనారాయణ,పట్టణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఎర్రగుంట్ల చంద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి మెరుగు మధుసూదన్,సహాయ కార్యదర్శి ఎక్కలదేవి భాస్కర్,మాజీ అధ్యక్షుడు ఎక్కాల దేవీ నరహరి కార్యవర్గ సభ్యులు మెరుగు అనిల్ సంతోష్ పాండురంగం,తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలలో పాల్గొనే మహిళలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు






**మున్సిపల్ కమిషనర్ రాయలింగు**

**మందమర్రి,సెప్టెంబర్21(సూర్యరేఖ)** బతుకమ్మ వేడుకలలో పాల్గొనే మహిళలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయలింగు తెలిపారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పట్టణంలో వేర్వేరు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ,నిమజ్జన ఘాట్లను చెరువుల సుందరీకరణ,లైటింగ్ నిర్వహణ,పారిశుద్ధ్య పనులను పురపాలక సంఘం కమిషనర్ తుంగపిండి రాజలింగు ప్రత్యక్షంగా పరిశీలించారు. పట్టణంలో మహిళలు బతుకమ్మలను ఆడుకోవడానికి వీలుగా ఉండేందుకు పట్టణంలోని బతుకమ్మ ఘట్ల వద్ద ఆదివారం పారిశుద్ధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు.పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... బతుకమ్మ తెలంగాణ ప్రజల అస్తిత్వానికి సాంస్కృతిక జీవనానికి ప్రతిక బతుకమ్మ పండుగ అని, పండుగను సురక్షితంగా శుభ్రంగా జరుపుకోవడంలో మున్సిపాలిటీ పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. ప్రజల సహకారంతో పండుగ విజయవంతంగా పూర్తవుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణ మున్సిపల్ అధికారులు,సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను తొలగించిన స్థానికులు





**మణికొండ,సెప్టెంబర్17(సూర్యరేఖ)** మణికొండ మున్సిపల్ పరిధిలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను తొలగించి ప్రమాదాల నివారణకు చొరవ చూపాలని స్థానికులు హరిహరనాథ్ రెడ్డి,వసిరెడ్డి శ్రీనివాస్ రావు,దాసరి విశ్వనాథ్,లు అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్ షిప్ ప్రతి వీధిలో అక్కరకు రాని కేబుల్ వైర్,లు తీసివేశారని,కానీ వాటిని తొలగించ కుండా రోడ్డుపైనే పడేయడం ఏంటని ప్రశ్నించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషయంపై మున్సిపల్ అధికారి డివిజనల్ ఇం జనీర్ ను కలువగా అందుకు స్పందించి విద్యుత్ శాఖ వారు కేబుల్ వైర్లను తీసివేస్తారని తెలిపారని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.ఎక్కడి వక్కడే వేసి ఉండడం వలన తామే తమ కర్తవ్యంగా భావించి పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు నడకదారిన వెళ్లే వారు ఆఖరకు ద్విచక్ర వాహనాలను నడిపే వాహనదారులు సైతం ఈ కేబుల్ వైర్ల వల్ల ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు.దీంతో తామే నిర్లక్ష్యంగా వదిలిన కేబుల్ వైర్లను స్వయంగా తొలగించినట్లు వివరించారు.

# రాజేంద్రనగర్ హరిహర క్షేత్రంలో నేటి నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రులు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ లోని శ్రీవెంకటేశ్వర స్వామీ దేవాలయం (హరిహర క్షేత్రం)లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శ్రీదేవీ శరన్నవరాత్రి దసరా మహొత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పౌడ్యమి నుంచి దశమి వరకు ఈ నవరాత్రులు ఉంటాయన్నారు.అందులో బాగంగా ఈ నెల 22న సోమవారం శ్రీపార్వతీదేవి అమ్మవారి అలంకరణలో,23న మంగళవారం శ్రీమంగలగౌరీ దేవీ అమ్మవారు.24న బుధవారం శ్రీబాల త్రిపురసుందరీదేవిగా,25వ తేదీన గురువారం శ్రీగాయత్రీ దేవిగా,26వ తేదీ శుక్రవారం శ్రీలలిత త్రిపుర సుందరీదేవీ అమ్మవారిగా,ఈ నెల27శనివారం శ్రీఅన్నపూర్ణదేవిగా, 28వ తేదీ ఆదివారం శ్రీమహాలక్ష్మీ దేవి అమ్మవారిగా,29వ తేదీ సోమవారం శ్రీసరస్వతీదేవీ అమ్మవారిగా భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారన్నారు.అదే రోజు సాయంత్రం 7గుటలకు దేవాలయం అవరణలో దాండియా కార్యక్రమం ఉంటుందన్నారు.30న మంగళవారం శ్రీదుర్గాదేవీ అమ్మవారిగా,అక్టోబరు 1వ తేదీన బుధవారం



శ్రీమహిషాసుర మర్థినిదేవీగా,అక్టోబరు 2వ తేదీన గురువారం శ్రీరాజరాజేశ్వరీ దేవీ అమ్మవారిగా దర్శనం ఇచ్చి పూజలు అందుకోనున్నారు.అదే రోజున విజయదశమి పండుగను నిర్వహించడం జరుగుతుందని దేవాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఈ నెల30న దుర్గాష్టమి సందర్భంగా స్త్రీల సామూహిక కుంకుమార్చన దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న ఉదయం 10:30 గంటల నుంచి స్త్రీల సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరుగుందని నిర్వాహకులు తెలిపారు.అక్టోబరు 2వ తేదీన గురువారం విజయదశమి వేడుకలు ఉంటాయన్నారు.ఉదయం 5 గంటలకు జగన్మాత శ్రీపార్వతీ దేవీ అమ్మవారి నగర సంకీర్తన, పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల సేవ,శమీపూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేసిన డాక్టర్ మోహన్ నాయక్



**రామాయంపేట,సెప్టెంబర్21(సూర్య రేఖ)** రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన నల్లల దుర్గయ్య అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతూ ఆదివారం కన్నుమూశారు.దుర్గయ్య కుటుంబం తీవ్ర పేదరికంలో ఉన్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లీలా గ్రూప్ చైర్మన్ డా.మోహన్ నాయక్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేసి,దుర్గయ్య అంత్యక్రియలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు,మాజీ సర్పంచ్ రవీందర్,కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు అశోక్ కాంగ్రెస్ పార్టీ మెదక్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి,తార్య నాయక్‌తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు హాజరయ్యారు.

## అంబరాన్నంటిన తెలంగాణ సాంస్కృతిక, సాంప్రదాయాలు..

**శ్రీహర్ష స్కూల్ లో బతుకమ్మ వేడుకలు..**






**జల్ పల్లి,సెప్టెంబర్17 (సూర్యరేఖ)**దసరా పండుగ సందర్భంగా జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామకాలనీ శ్రీహర్ష స్కూల్ లో సాంస్కృతిక, సంప్రదాయాలు అంబరాన్ని అంటాయి. దసరా పండుగను పురస్కరించుకొని శ్రీహర్ష స్కూల్ ఆవరణలో బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఉస్కేమూరి నిరంజన్, స్కూల్ కరెస్పాండెంట్ శిరీష బాలకృష్ణ దసరా నవరాత్రి బతుకమ్మ ఉత్సవాల గురించి, విద్యార్థుల కు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలను తిలకించి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ అకాడమీ డీన్. కృష్ణారెడ్డి,ప్రిన్సిపల్ వి.స్వప్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోతంశెట్టిపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిభిరం

**పిచ్చి మొక్కల తొలగింపు**




**కొల్చారం,సెప్టెంబర్21(సూర్య రేఖ):** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం జిడిసి మెదక్ కళాశాలకు చెందిన యుఎన్ఐఎల్-1 ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిభిరం నిర్వహించారు.అందులో భాగంగా ఆదివారం యోగతో తమ దినచర్యను ప్రారంభించారు.అనంతరం అల్పాహారం స్వీకరించిన తర్వాత పిజిలో ఎక్సైజ్ నిర్వహించి వారు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రమధాన కార్యక్రమం చేపట్టారు.ఈ మేరకు పోతంశెట్టిపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పొడుగునా పిచ్చి మొక్కలను,చెత్తను,గడ్డిని తొలగించారు.పోతంశెట్టిపల్లి గ్రామంలోని పేరుపోయిన వ్యర్థాలను తొలగించారు.అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.అనంతరం సాహిత్య కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్,యుఎన్ఐటి-1 ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు.రాత్రి సాంస్కృత కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించారు.

# ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు





**తెలంగాణ సంస్కృతికి ప్రతీక**
**ఆడపడుచులకు ఇష్టమైన పండుగ..**
**ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాట్లు..**
**చెరువు కట్టల వద్ద ముస్తాబైన విద్యుత్ దీపాలు..**
**బతుకమ్మ పువ్వుల్లో ఔషధ గుణాలు..**

**రామాయంపేట,సెప్టెంబర్21(సూర్య రేఖ)** తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక.ఇది ఆడపడుచుల పండుగ,సాయంత్రం అయ్యేసరికి పట్టు చీరలు మెడలో నగలతో ముస్తాబై పూలతో పేర్చిన బతుకమ్మను ప్రధాన కూడళ్లలో విశాలమైన ప్రదేశంలో పెట్టి సద్దుల బతుకమ్మ వరకు సాయంత్రం వేళ గాజుల గలగల వాయిద్యాలుగా మలచి,పల్లవికి శృతి కలుపుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...బంగారు బతుకమ్మ ఉయ్యాలో..కలవారి కోడలు ఉయ్యాలో..కలికి కామాక్షి ఉయ్యాలో...అంటూ బతుకమ్మ ఆడుతూ పాటలు లయబద్ధంగా పాడుతూ ఉంటారు. పూలతో పూజించే దేవత అమ్మ..పూలనే దేవతగా పూజిస్తే బతుకమ్మ. బతుకమ్మ బతుకును కొలిచే పండుగ బతుకునిచ్చే తల్లిని శక్తిరూపంగా భావిస్తూ లక్ష్మి గౌరీదేవీలను ఆటపాటల ద్వారా పూజిస్తూ రకరకాల వంటలు నైవేద్యంగా సమర్పిస్తూ మనకున్నంతలో కొత్తబట్టలు,నగలు ధరిస్తూ ఆడబిడ్డలను పండుగకు ఆహ్వానిస్తూ జరుపుకొనే గొప్ప వేడుక బతుకమ్మ,మనకే ప్రత్యేకం ఈ పండుగ.పూల జాతరకు పల్లె పట్టణాలు ముస్తాబయ్యాయి. షెత్రమాస రోజు నుంచి తొమ్మిది రోజుల వరకు బతుకమ్మను పేర్చి అడుతారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నీటి వనరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు బారికేడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు.ఈ ఏడాది చెరువుల నిండా నీళ్లు ఉన్నందున జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

# శరన్న నవరాత్రి ఉత్సవాలకు భద్రత ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**



**కామారెడ్డి,సెప్టెంబర్21(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా ప్రజలు శాంతియుత వాతావరణంలో దసరా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రజలను కోరారు.ప్రజలు ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకునేలా పోలీసు బందోబస్తు ఉండేలా ప్రతి మండప నిర్వాహకుడు తప్పనిసరిగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ సమాచారం ఆధారంగా పోలీసు శాఖ భద్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తుందని ఎస్పీ అన్నారు.మండపాల నిర్వాహకులు నియామ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్పీ తెలిపారు.మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదే,ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్దేశిత సమయానికి శోభాయాత్ర విగ్రహ నిమజ్జనం పూర్తి చేయాలని,మండపాలు ప్రజా రవాణా ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు.మండపం స్థలానికి సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి,మండప కమిటీ సభ్యుల వివరాలు ఫోన్ నెంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని,రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు వాడకూడదు,డీజేలు పూర్తిగా నిషేధం,24 గంటల వాలంటీరు హాజరుగా ఉండాలని,భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని,అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ నీటి బకెట్లు ఏర్పాటు చేయాలి,మద్యం సేవించడం,పేకాట,అసభ్య నృత్యాలు,ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు నిషేధం,ప్రతి మండపంలో తనిఖీ పుస్తకం ముంచాలి అనుమానాస్పద వస్తువులు వ్యక్తులు కనబడితే వెంటనే 100 కు సమాచారం ఇవ్వాలి,దీపాలను ఇసుక బియ్యంపై ఉంచి అగ్ని ప్రమాదాలు నివారించాలి,ఎలక్ట్రిషన్ నిపుణులతో చేయించుకోవాలి,షార్ట్ సర్క్యూట్లను నివారించాలి గాలి వల్ల అగ్ని ప్రమాదం జరగకుండా అలంకారాలలో జాగ్రత్తలు తీసుకోవాలి విగ్రహాల రవాణాలో కరెంటు తీగలకు తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి సామూహిక మధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మరాదు,సందేహాలు ఉంటే స్థానిక పోలీసులను లేదా 100 ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# మహా బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయండి

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరు**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ చారి**




**శ్రీరాంపూర్,సెప్టెంబర్21(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పట్టణంలోని ప్రగతి స్టేడియంలో ఈ నెల 23 న జరిగే మహా బతుకమ్మ వేడుకలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొంటున్న కార్యక్రమాన్ని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన చారి కోరారు.ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో జాగృతి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు,ప్రతీక బతుకమ్మ పండుగ అని,తెలంగాణ అస్తిత్వం,బతుకమ్మలోనే ఉందని అన్నారు.మన బతుకమ్మను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిందని,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,హెచ్ఎంఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అని వ్యాఖ్యానించారు.ఈ నెల 23న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో సాయంత్రం 5 గంటలకు జరిగే మహా బతుకమ్మ వేడుకలో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాగృతి కార్యదర్శి సంపత్ గౌడ్,కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్,కట్కూరి రత్నాకర్ రెడ్డి,సింగరేణి జాగృతి,కందుల ప్రశాంత్,అయితే ప్రశాంత్,రాజశేఖర్ మహేష్ గౌడ్,రాకేష్,జాగృతి,హెచ్ఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లోటస్ లీఫ్ అపార్ట్మెంట్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు



**అందోల్,సెప్టెంబర్21(సూర్య రేఖ)**సంగారెడ్డి జిల్లా అమీర్ పూర్ మండలం కిష్టారెడ్డి పెట్ లోటస్ లీప్ ప్లాంట్ లో మహిళలు సద్దుల బతుకమ్మ పండగను ఘనంగా ఆటపాటలతో భక్తి శ్రద్దలతో నిర్వహించారు.లోటస్ లీఫ్ అపార్ట్మెంట్ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వారికీ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లోటస్ లీప్ అపార్ట్మెంట్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## నేటి నుండి శ్రీ కనక దుర్గ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



**నాంపల్లి,సెప్టెంబర్21 (సూర్యరేఖ)**కార్వాన్ హరిదాస్ నగర్ లో వెలసిన శ్రీ కనకదుర్గ దేవాలయంలో ఈ నెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని ఈ మహత్తరమైన ఉత్సవాలను కనులారా తిలకించి తరించగలరని ఆలయ చైర్మన్ కోడురు శ్రీధర్ సాగర్ కోరారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోడురు శ్రీధర్ సాగర్ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి ప్రతిరూపాలను వివరిస్తూ 22న సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగాను,23న మంగళవారం శ్రీ గాయత్రీ దేవిగాను,24న బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవిగాను,25న గురువారం శ్రీ కాత్యాయనీ దేవిగాను,26న శుక్రవారం శ్రీ మహాలక్ష్మి దేవిగాను,27న శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగాను, 28న అదివారం శ్రీ మహా చండీ దేవిగాను,29న సోమవారం శ్రీ సరస్వతి దేవిగాను,30న మంగళవారం శ్రీ దుర్గా దేవి గాను,సెప్టెంబర్ 1న బుధవారం శ్రీ మహిషాసురమర్దిని దేవిగాను,2న గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా నిజస్వరూపం భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు.శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చీరల వేలంపాట కార్యక్రమం,అదేరోజు 8 గంటలకు భక్తి శ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం కార్యక్రమాలు ఉంటాయని,భక్తులు ఎవరైనా కానుకులు వస్తు,ధన రూపంలో ఇవ్వాలనుకున్నవారు దేవాలయంలో సంప్రదించవచ్చని చైర్మన్ కోడురు శ్రీధర్ సాగర్ పేర్కొన్నారు.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు



**మంచిర్యాల,సెప్టెంబర్21(సూర్యరేఖ)** మంచిర్యాల పట్టణంలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఆదివారం కలశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హాజరై ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి నవ దుర్గామాత చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థుల్లో సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కలిగించాలని,కళల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ,సమాజంలో ముందంజలో ఉండాలని కోరారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రతీ సంవత్సరం సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ,బతుకమ్మ ఉత్సవాలను విద్యార్థుల జోష్ తో నిర్వహించుకోవడం ఒక గొప్ప అనుభూతినిస్తుందని అన్నారు.ఆ అమ్మవారి ఆశీస్సులు సమాజంలో ప్రతి ఒక్కరి మీద ఉండాలని ఉద్దేశంతో వేడుకను చాలా గొప్పగా నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.వేడుకుల సందర్భంగా ప్రాంగణాన్ని వివిధ రకాల వస్తువులతో చక్కగా అలంకరించి పండుగ శోభను రెట్టింపు చేశారు.విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగు రంగుల పుష్పాలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలకంరించి బతుకమ్మలను ఒక చోట పేర్చి సాంప్రదాయ వస్త్రాలు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేస్తూ వేడుకలను కోలాహాలంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కలశాల ఉపాధ్యాయునిలు,విద్యార్థినిలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు





**రాజేంద్రనగర్,సెప్టెంబర్17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలిపురం సాయికాలనీలో కొలువై ఉన్న శ్రీశ్రీ దుర్గాభవాని మాత ఆలయంలో ఈనెల 22వ తేదీ అశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి వచ్చేనెల 2వ తేదీ దశమి వరకుశ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఒక్కో రోజు ఒక్కో విధంగా అమ్మవారిని విశేష అలంకారాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం దేవి అవతారాలు అభిషేకం సాయంత్రం మహా హారతి ,నీరాజనం, మంత్రపుష్పం,మహా ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు వివరించారు. నవరాత్రుల్లో భాగంగా ఈనెల 26వ తేదీన సామూహిక మహాలక్ష్మి కుంకుమార్చనలు,29న సోమవారం అక్షరాభ్యాసాలు,30వ తేదీ మంగళవారం శ్రీదుర్గా చండీ హెూమం,వచ్చే నెల రెండవ తేదీ గురు వారం విజయదశమి సందర్భంగా ఆలయంలో సాయంకాలం జమ్మీపూజ నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

**విశేష అలంకారాలు..**

మొదటిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా రెండవ రోజు శ్రీగాయత్రీ దేవిగా,మూడవరోజు శ్రీఅన్నపూర్ణాదేవిగా,నాలుగో రోజు శ్రీకాత్యాయని దేవి,ఐదవ రోజు శ్రీమహాలక్ష్మిదేవి,ఆరవ రోజు శ్రీలలితాదేవి,ఏడవ రోజు శ్రీగౌరీదేవి ఎనిమిదవ రోజు శ్రీమహా సరస్వతిదేవి,తొమ్మిదవ రోజు శ్రీదుర్గాభవాని మాత,పదవ రోజు శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా, 11వ రోజు శ్రీరాజరాజేశ్వరి దేవి గా అలంకరించి ప్రత్యేక నైవేద్యాలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు.

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ.. పూదోటలుగా మారిన వాకిళ్లు..





**తీరొక్క పూలతో పూజలు..**
**బతుకమ్మ పాటలతో హెూరెత్తిన గ్రామాలు..**
**ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**
**గగన్ పహాడ్ లో ఘనంగా ఎంగిలి పువ్వుల బతుకమ్మ సంబురాలు..**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి.తీరొక్క పూలతో అంగరంగ తీర్చిదిద్దిన బతుకమ్మలు కొలువుదీరాయి. తొలిరోజు ఎంగిలి పువ్వు పండుగను సంబురంగా షురూ అయ్యాయి.తొలిరోజు వేడుకల్లో భాగంగా తంగేడు, గునుగు బంతి పట్నం బంతి,పట్టుకుచ్చు,తామర పువ్వు,గుమ్మడి పువ్వులు,రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మను పేర్చి,గౌరమ్మను అలంకరించారు. సాయంత్రం బతుకమ్మలను ఒకేచోటకు చేరి ఉయ్యాల పాటలతో హెూరెత్తించారు.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో..అంటూ బతుక మ్మల చుట్టూ తిరుగుతూ కోలాహలంగా పండు గను జరుపుకున్నారు. ఆడపడుచుల ఆటపాట లు. సంప్రదాయ నృత్యాలతో కాలనీలు హెూరె త్తాయి. బతుకమ్మ అంటేనే ప్రకృతిని పూజించే.. పూలనే కొలిచే పండుగ. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. ఉయ్యాల పాటలతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీలు,కాలనీల్లో మహిళలు ఒకచోట చేరి 'ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములో సందమామ 'చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా.. అందాల బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ బతుకమ్మ పాటలతో హెూరెత్తించారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**గగన్ పహాడ్ లో..**

ఎంగిలిపూల బతుకమ్మను ఆదివారం సంబురంగా జరుపుకున్నారు. మహిళలు తంగేడు గడ్డిపువ్వు, చామంతి వంటి రకరకాల పువ్వులు తీసుకొచ్చి బతుకమ్మను పేర్చారు.. గగన్ పహాడ్ బస్తీ లోని బొడ్రాయి ప్రధాన చౌరస్తాల్లో అలంకరించి రాత్రి వరకు బతుకమ్మను పేర్చి ఆడి పాడారు.



# 23న చార్మినార్ వద్ద బతుకమ్మ సంబరాలు



కేంసారం సరళ

**నాంపల్లి,సెప్టెంబర్21(సూర్యరేఖ)** తెలంగాణ మహిళలు ఎన్ని అవరోధాలు ఎదురైనా,అడ్డంకులు వచ్చినా బతుకమ్మ పండుగను పడగొట్టలేదని,బతుకమ్మ పండుగను బతికించిన ఘనత తెలంగాణ మహిళామణులదేనాని కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌజ్ డివిజన్ బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షురాలు కేంసారం సరళ కోరారు.ఈ సందర్భంగా కేంసారం సరళ మాట్లాడుతూ..బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఇదే స్పూర్తితో భాగ్యనగరంలోని చార్మినార్ వద్ద సెప్టెంబర్ 23న సాయంత్రం 5 గంటలకు మహిళామణులంతా కలిసి బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకోనున్నాం అని తెలిపారు.ఆడపిల్లలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చార్మినార్ వద్ద ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలు విజయవంతం చేయాలని కేంసారం సరళ విజ్ఞప్తి చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**కౌల్చారం,సెప్టెంబర్21(సూర్య రేఖ):** నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సహకారంతో మెదక్ జిల్లా కౌల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన బోయినీ నర్సమ్మకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును కౌల్చారం మండల బిఆర్ఎస్ పార్టీ ఐకాస యువ నాయకుడు రవితేజ రెడ్డి,పైతర బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి అందజేశారు.

## ఓడపల్లి రాజేందర్ జ్ఞాపకార్థం బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**మంచిర్యాల,సెప్టెంబర్21(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా కేంద్రం లోని కాలేజీ రోడ్ లో గల పాత సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఓడపల్లి రాజేందర్ జ్ఞాపకార్థం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు.పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ ఓడపల్లి శ్రీనాథ్ తన తండ్రి రాజేందర్ జ్ఞాపకార్థం నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమై ఆదివారం ముగిసింది.టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనాథ్ మాట్లాడుతూ.. క్రీడలు ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ముఖ్యమని అన్నారు.క్రీడలు మానసిక, శారీరక దృఢత్వనికి తోడ్పడుతుందని అన్నారు.బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్రీడాకారుడు పెట్టం మల్లేష్ అధ్యక్షత వహించారు.పెట్టం మల్లేష్ మాట్లాడుతూ..నేటి సమాజంలో బ్రతికున్న తల్లితండ్రులను పట్టించుకునే పరిస్థితి లేవని,కానీ శ్రీనాథ్ మరణించిన తన తండ్రి జ్ఞాపకార్థం ఆటల పోటీలు నిర్వహించాలని సంకల్పించి ఈ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ప్రతి మనిషి క్రీడలు తమ జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు.చిన్న వయసులో అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నారని,క్రీడలతో ఆరోగ్య సంరక్షణ వస్తుందన్నారు.ఈ టోర్నమెంట్ లో కత్తెర్ల తిరుపతి-సతీష్ పార్టనర్స్ విజేతలుగా నిలువగా,రావుల నగేష్-తాళ్లపల్లి మహేందర్ రన్నర్ గా నిలిచారు.ఉత్తమ ఆటగాడు మైలగాని శ్రీనివాస్,ఏమర్జింగ్ ప్లేయర్ గా వెంకటేష్ లు నిలిచారు.ఈ టోర్నమెంట్ లో సీనియర్ క్రీడాకారులు కోచ్ శ్రీనివాస్,సత్యనారాయణ రెడ్డి,వెంకటేష్,సాగర్,రాజు గౌడ్,గాలయ్య,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయనగర్ లో ఘనంగా ఎంగిలి పువ్వుల బతుకమ్మ సంబురాలు..





**రాజేంద్రనగర్,సెప్టెంబర్17 (సూర్యరేఖ)**రాజేంద్రనగర్ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి.తీరొక్క పూలతో అంగరంగ వైభవంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు కొలువుదీరాయి. తొలిరోజు ఎంగిలి పువ్వు పండుగను సంబురంగా ప్రారంభమయ్యాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి,గౌరమ్మను అలంకరించారు.సాయంత్రం బతుకమ్మలను ఒకేచోటకు చేర్చి ఉయ్యాల పాటలతో హెూరెత్తించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..అంటూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ కోలాహలంగా పండుగను జరుపుకున్నా రు.ఆడపడుచుల ఆటపాటలు.. సంప్రదాయ నృత్యాలతో కాలనీలు హెూరెత్తాయి.

**మార్కండేయ నగర్ లో..**

మార్కండేయ నగర్ లో తొలిరోజు ఎంగిలి పువ్వుల పండుగను సంబురంగా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడి పాడారు. ప్రసున లక్ష్మి,రాధిక,సునీత,స్వప్న, బాలమణి, ఆధ్యా,ద్రీవీ, నిర్మల అమృతమ్మ,సంధ్యలు పాల్గొన్నారు.




## ఓటీటీలోకి ఫహాద్ ఫాజిల్ కొత్త మూవీ..

మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ 'ఓడుం కుతిర చాదుం కుతిర' ఈ సినిమాలో కొత్త లోకతో సూపర్ హిట్ అందుకున్న ల్యాణి ప్రియదర్శన్ రేవతి పిళ్లై కథానాయికలుగా నటించారు. ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ నెల 26 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది.



# మరోసారి రిస్క్ చేస్తున్న రాజశేఖర్..

## వర్కౌట్ అయ్యేనా?

హీరో రాజశేఖర్ వెండితెరపై కనిపించి చాలా రోజులైంది. ఆయన హీరోగా నటించిన చివరి చిత్రం 'శేఖర్'. 2022లో ఈ మూవీ రిలీజైంది. ఆ తర్వాత ఆయన హీరోగా నటించిన చిత్రాలేవి ప్రేక్షకుల ముందుకు రాలేదు కానీ నితిన్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'(2023)లో క్యామియో రోల్ ప్లే చేసి ఆకట్టుకున్నాడు. చాలా కాలం తర్వాత రాజశేఖర్ మళ్లీ ఓ సినిమా చేయబోతున్నాడట. అది కూడా రీమేక్. తమిళ్‌లో పెద్ద హిట్ అయిన 'లబ్బర్ పందు' సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారట రాజశేఖర్. హరీష్ కళ్యాణ్- దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన 'లబ్బర్ పందు' సినిమాను తమిళరాసన్ పంచముత్తు దర్శకత్వం వహించారు. గల్లీ క్రికెట్ బ్యాక్?డ్రాప్?తో వచ్చిన ఈ చిత్రం బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారట. ఒరిజినల్‌లో దినేష్ చేసిన పాత్రను తెలుగులో రాజశేఖర్ చేస్తున్నారట. విశ్వదేవ్ రాచకొండ మాతృకలో అర్జున్ కళ్యాణ్ చేసిన పాత్రను చేస్తున్నాడట. రాజశేఖర్ తనయురాలే ఇందులో హీరోయిన్‌గా కనిపించనుందట. ఓటీటీ వాడకం పెరిగిన తర్వాత రీమేక్ చిత్రాలేవి వర్కౌట్ కావడం లేదు. ఒక భాషలో హిట్టయిన సినిమాను..ఓటీటీలో అన్ని ప్రాంతాల వారు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజశేఖర్ రిస్క్ చేసి రీమేక్ చేస్తున్నాడు. ఒకప్పుడు ఆయన రీమేక్ చేసిన చిత్రాలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. కానీ ఇప్పుడు పరిస్థితుల మారాయి. ఆయన రీమేక్ చేసిన గడ్డం గ్యాంగ్, శేఖర్ చిత్రాలు సైతం బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. అయినా కూడా రాజశేఖర్ మళ్లీ రీమేక్‌నే నమ్ముకున్నాడు. మరి ఆయన రిస్క్ ఫలిస్తుందో లేదో చూడాలి.

## ఇండియన్ ఐకాన్‌కు దక్కిన గౌరవం.. మోహన్ లాల్‌కు ఎన్టీఆర్ విషెస్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్‌కు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. సినీ రంగంలో అందించే ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఇండియన్ సినిమా ఐకాన్‌కు దక్కిన గౌరవమని ట్వీట్ చేశారు. కాగా.. కేంద్ర ప్రభుత్వం 2023 ఏడాదికి గానూ సినీ పరిశ్రమలో అందించే అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా వచ్చిన జనతా గ్యారేజ్ చిత్రంలో మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. 2016లో వచ్చిన ఈ సినిమాలో సమంత హీరోయిన్‌గా నటించింది. కాగా.. మోహన్ లాల్ మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించారు.

## అట్లీకి బర్త్‌డే విషెస్ తెలిపిన అల్లు అర్జున్

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్, ప్రముఖ తమిళ దర్శకుడు అట్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 21న అట్లీ పుట్టినరోజు కావడంతో బన్నీ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు అట్లీ. ఈ సంవత్సరం నీకు గొప్పగా ఉండాలని కోరుకుంటున్నాను. నువ్వు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మీరు సృష్టిస్తున్న సినిమాటిక్ మాయాజాలాన్ని అందరూ అనుభవించే వరకు వేచి ఉండలేను అంటూ అల్లు అర్జున్ రాసుకోచ్చాడు. అట్లీ గతంలో 'రాజా రాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఈ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ప్రస్తుతం అట్లీ అల్లు అర్జున్‌తో కలిసి ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో దీపిక పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది.







# దీపికా పదుకొణె స్థానంలో స్టార్ హీరోయిన్.. రేసులో ఇద్దరు

'కల్కి 2898 ఏడీ' సినిమా నుంచి బాలీవుడ్ నటి దీపికా పదుకొణెను తప్పించిన తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేసేది ఎవరు అనే ప్రశ్న చాలామందిలో ఉంది. ఈ విషయంలో ఇప్పటికే పెద్ద ఎత్తున చర్చ కూడా జరుగుతుంది. ఈ ఏడాది చివరిలో సీక్వెల్ షూటింగ్ ఉంటుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడు సడెన్‌గా దీపికను తప్పించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కల్కిలో దీపికా పదుకొణె పర్‌ఫార్మెన్స్ చాలా బాగుందని, తన క్యారెక్టర్‌లో ఆమె లీనమై నటించారని టాక్ ఉంది. ఇప్పుడు ఆ స్థానాన్ని రీప్లేస్ చేసే ఏకైక హీరోయిన్ అనుష్క మాత్రమేనని సోషల్‌మీడియాలో చాలామంది తమ అభిప్రాయాన్ని పంచుకుంటున్నారు. దీపిక పదుకొణెను రీప్లేస్ చేసే హీరోయిన్ కోసం కల్కి యూనిట్ ఇప్పటికే వేట మొదలు పెట్టింది. ఈ క్రమంలో సోషల్‌మీడియాలో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభాస్-అనుష్క కలిసి మరోసారి సినిమా చేస్తే చూడాలని అభిమానులతో పాటు నెటిజన్లు కూడా కోరుతున్నారు. బాహుబలి తర్వాత మళ్లీ వీరిద్దరూ కలిసి ఎక్కడా కూడా కనిపించలేదు. అందువల్ల దీపిక స్థానాన్ని అనుష్కతో భర్తీ చేస్తే సినిమాకు మరింత జోష్ రావడం ఖాయం అంటున్నారు.బాహుబలిలో గర్భవతిగా అనుష్క కనిపించిన విషయం తెలిసిందే. కల్కిలో కూడా దీపిక గర్భవతిగానే కనిపిస్తుంది. దీంతో ఎక్కువ మంది ఇదే కంటిన్యూటీని కోరుకుంటున్నారు. 'కొత్త లోక' సినిమాతో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న 'కళ్యాణి ప్రియదర్శన్'ను కల్కి కోసం ఎంపిక చేసినా బాగుంటుందని కొందరు చెబుతున్నారు. కొత్త లోక సినిమాలో ఆమె సూపర్ యోధగా నటించి అభిమానులను మెప్పించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో నయనతార, అలియా భట్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంలో చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ త్వరలో అధికారికంగా ప్రకటించే ఛాన్స్ ఉంది.

# రామ్ చరణ్ సరసన కృతి సనన్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో పెద్ది సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ భారీ అంచనాలు క్రియేట్ చేసింది. ఇందులో చరణ్ ఊరమాస్ అవతారంలో కనిపించనున్నాడు. అలాగే పక్కా మాస్ యాక్షన్ హీరోగా చాలా కాలానికి థియేటర్లలో విధ్వంసం సృష్టించేందుకు రెడీ అయ్యారు చరణ్. దీంతో ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. ఈ సినిమాతోపాటు చరణ్ తన నెక్ట్స్ ప్రాజెక్ట్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో చరణ్ తన నెక్ట్స్ ప్రాజెక్ట్ చేయనున్నారు. వీరిద్దరి కాంబోలో ఇదివరకు వచ్చిన రంగస్థలం సినిమా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరి కాంబో మరోసారి రిపీట్ కావడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. పాన్ ఇండియా లెవల్లో ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. దీంతో ఇప్పుడు హీరోయిన్ ఎవరనే విషయంపై నెట్టింట చర్చ నడుస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఫిల్మ్ వర్గాల్లో ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తుంది. ఈ సినిమాలో చరణ్ జోడిగా బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. గతంలో సుకుమార్, మహేష్ బాబు కాంబోలో వచ్చిన నేనొక్కడినే సినిమాతో కథానాయికగా పరిచయమైంది కృతి. ఆ తర్వాత దోచేయ్, ఆదిపురుష్ వంటి చిత్రాల్లో నటించింది. ఈ ముద్దుగుమ్మ నటించిన ఈ మూడు సినిమాలు అంతగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్ కు మకాం మార్చిన కృతి.. ఇప్పుడు చాలా కాలం తర్వాత రామ్ చరణ్ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,